SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

www.epapersamayam.com APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న సమయం న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.

ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను. సీనియర్లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం ఉంటుంది.

ఫోన్ నెం : 99483 13985/ 89789 60131

సంపుటి : 18 | సంచిక : 209 | ఎడిటర్ : విక్రం కుమార్ | మంగళవారం 08 ఏప్రిల్ 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల: రూ.5

## వంటగ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంపు

- హైదరాబాద్‌లో రూ.905కి చేరిన ధర

**సమయం న్యూస్, హైదరాబాద్:** గృహావసరాలకు వినియోగించే వంటగ్యాస్ సిలిండర్ ధరను కేంద్ర ప్రభుత్వం సోమవారం రూ.50 చొప్పున పెంచింది. పెరిగిన ధరలు మంగళవారం నుంచే అమల్లోకి రానున్నాయి. దీంతో రాష్ట్రంలో అటు సామాన్య వినియోగదారులు, ఇటు రాష్ట్ర ప్రభుత్వంపై కలిపి ప్రతినెలా రూ.71 కోట్లకు పైగా భారం పడనుంది. రాష్ట్రంలో వినియోగదారులు నెలకు దాదాపు కోటి

తరువాయి 2లో





## విద్యార్థులపై.. కేసుల ఉపసంహరణ

- హెచ్‌సీయూ క్యాంపస్ నుంచి పోలీసు బలగాలు వెనక్కు
- సంఘాల ప్రతినిధులతో చర్చ అనంతరం మంత్రుల కమిటీ నిర్ణయం
- సామరస్య పరిష్కారం దిశగా ప్రభుత్వం చర్యలు

**సమయం న్యూస్, హైదరాబాద్:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) భూముల విషయంలో విద్యార్థులతో నెలకొన్న వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించేందుకు చర్యలు ప్రారంభించిన ప్రభుత్వం మొదట.. వారిపై కేసులను ఉపసంహరించుకోవాలని నిర్ణయించింది. వర్సిటీ నుంచి పోలీసు బలగాలను ఉపసంహరించుకోనుంది. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి, విశ్వవిద్యాలయం అధ్యాపకసంఘం ప్రతినిధులు, సివిల్ సొసైటీ ప్రతినిధులతో సోమవారం మంత్రుల కమిటీ

తరువాయి 2లో

## ఆరోగ్య భాగ్యం..

- ప్రతి నియోజకవర్గ కేంద్రంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి
- అమరావతిలో మెగా గ్లోబల్ మెడిసిటీ ప్రాజెక్టు
- రాష్ట్రమంతా డిజిటల్ హెల్త్ నెర్వ్ సెంటర్లు
- మొబైల్ వాహనాలతో ఇంటి దగ్గరే 20-25 రకాల వైద్య పరీక్షలు
- ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి



2లో

## ప్రజల కోసం మా ఇంటి తలుపులు తెరిచే ఉంటాయి

- మంత్రి నారా లోకేశ్
- ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న 624 మందికి శాశ్వత హక్కు కల్పిస్తూ పట్టాలు
- ఈ స్ఫూర్తితో త్వరలోనే రాష్ట్రమంతా అమలు చేస్తామని వెల్లడి

2లో





## ఉద్యోగాలు కోల్పోయిన టీచర్ల తరపున పోరాడతా

- బెంగాల్ సీఎం మమతా బెనర్జీ

2లో

## నాలాల్లోకి నిధులు.. రోడ్లపైకి నీళ్లు

- జీహెచ్ఎంసీలో పూడికతీతకు ఏటా రూ.50 కోట్ల ఖర్చు
- నగరంలో మెరుగుపడని వరద నీటి వ్యవస్థ
- ఇటీవలి వర్షా నికి 151 రహదారులపై ప్రవాహం

2లో




## శంషాబాద్.. జిందాబాద్

- రాజీవ్‌గాంధీ విమానాశ్రయం సరికొత్త రికార్డు
- గత ఆర్థిక సంవత్సరంలో 15 శాతం వృద్ధితో దేశంలోనే అగ్రస్థానం
- చివరి మూడు నెలల్లో 74 లక్షల మంది ప్రయాణంతో మరో రికార్డు

**సమయం న్యూస్, హైదరాబాద్, శంషాబాద్ :** శంషాబాద్ లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రయా ణికుల రాకపోకల్లో సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. గత ఆర్థిక సంవత్సరం 15.20 శాతం వృద్ధి సాధించి.. దేశంలోని అగ్రశ్రేణి విమానాశ్రయాల కంటే ఎగువన నిలిచి రికార్డు సృష్టించింది. శంషాబాద్ విమానాశ్రయం నుంచి 202425 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 2.13 కోట్ల మంది ప్రయాణించారు. రద్దీ ఇలాగే కొనసాగితే వచ్చే ఏడాది ప్రయాణికుల సంఖ్య మూడు కోట్లు దాటే అవకాశాలున్నాయని విమానాశ్రయ అధికారులు తెలిపారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో చివరి మూడు నెలలు.. జనవరి నుంచి మార్చి వరకూ దేశీయ, అంతర్జాతీయ ప్రయాణికుల రాకపోకల్లోనూ శంషాబాద్ అరుదైన ఘనతను సాధించింది. ఇక్కడి నుంచి నెలకు ప్రయాణించే

తరువాయి 2లో





## సుంకాలపై తగ్గేదే లేదు

- కొన్నిసార్లు చేదు మాత్రలు తప్పవు
- చైనా దిగిరాకపోతే మరో 50% వేస్తాం
- మళ్లీ రెచ్చిపోయిన ట్రంప్

వెస్ట్ పామ్ బీచ్ (ఫ్లోరిడా): సుంకాలపై వెనక్కి తగ్గేదే లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. సుంకాల సమానత్వం సాధిస్తే తప్ప సమస్యకు పరిష్కారం లభించబోదని పేర్కొన్నారు. చైనాపై మరింతగా సుంకాలను విధిస్తామని హెచ్చరించారు. 'చైనా విధించిన 34 శాతం సుంకాలను మంగళవారంలోగా ఉపసంహరించుకోకపోతే బుధవారం నుంచి అదనంగా 50 శాతం సుంకాలను విధిస్తాం. వారితో అన్ని రకాల చర్చలను నిలిపేస్తాం' అని ట్రంప్ హెచ్చరించారు. ఓ వైపు ప్రపంచ స్టాక్ మార్కెట్లు కుప్పకూలుతున్నా.. ఆర్థిక మాంద్యం భయాలు వెన్నాడుతున్నా.. ప్రపంచ వాణిజ్య వ్యవస్థ మునిగిపోతున్నా ట్రంప్ తన వైఖరికే కట్టుబడి ఉండటం గమనార్హం. ఆదివారం ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో ప్రయాణిస్తూ ఆయన మీడియాతో మాట్లాడారు. 'అంతర్జాతీయ

తరువాయి 2లో

## మహా సూర్య వందనం

- 21,850 మంది గిరిజన విద్యార్థుల హాజరు
- వరల్డ్ రికార్డ్ యూనియన్ సంస్థ గుర్తింపు



**సమయం న్యూస్, అరకులోయ :** గిరిజన ఆశ్రమ పాఠశాల ల్లోని 21,850 మంది విద్యార్థులు ఒకచోట పాల్గొని 'మహా సూర్య వందనం' చేశారు. ఈ కార్యక్రమానికి అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకులోయ వేదికైంది. సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో

తరువాయి 2లో

# వంటగ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంపు

(మొదటి పేజీ తరువాయి)

వరకు సిలిండర్లు కొనుగోలు చేస్తున్నారు. దీంతో వారిపై ప్రత్యక్షంగా రూ.50 కోట్ల అదనపు భారం పడనుంది.అలాగే మహాలక్ష్మి పథకం అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఆయా లబ్ధిదారులకు సంబంధించి రూ.21.45 కోట్లను అదనంగా చెల్లించనుంది. హైదరాబాద్‌లో సిలిండర్ ధర రూ.855 నుంచి రూ.905కి పెరిగింది. పంపిణీ కేంద్రాల నుంచి దూరాన్ని బట్టి రవాణా ఛార్జీలను పరిగణనలోనికి తీసుకుంటే పలు జిల్లా కేంద్రాలు, ఇతర ప్రాంతాల్లో ఇంకాస్త ఎక్కువ ధర పడుతోంది. ఉదాహరణకు నల్గొండలో సిలిండర్ ధర రూ.877 ఉండగా అది ఇప్పుడు రూ.927కి చేరింది. తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం గ్యాస్ కనెక్షన్ల సంఖ్య 1,42,72,200. అందులో 42.90 లక్షల మందికి ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద రూ.500కే సిలిండర్‌ను పంపిణీ చేస్తోంది. ధరలు ఎంత పెరిగినా ఆయా లబ్ధిదారులకు ప్రభుత్వం అదే ధరకు సిలిండర్‌ను సరఫరా చేస్తామని హామీ ఇచ్చింది. దీంతో మహాలక్ష్మి లబ్ధిదారులకు పెరిగిన సిలిండర్‌కు రూ.50ని రాష్ట్ర ప్రభుత్వం రాయితీ రూపంలో తిరిగి వారి ఖాతాల్లో జమ చేస్తుంది. తద్వారా ఈ పథకం లబ్ధిదారులపై ప్రస్తుతం పెరిగిన గ్యాస్ ధరల ప్రభావం ఉండదు. మహాలక్ష్మి లబ్ధిదారులు గాక మిగిలిన వినియోగదారులు 99,82,200 మంది ఉన్నారు. వారికి ఎలాంటి రాయితీ లేనందున ఒక్కో సిలిండర్‌పై రూ.50 చొప్పున వారు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఉజ్వల, సాధారణ వినియోగదారులకూ వంటగ్యాస్ ధరలు పెరిగినట్లు కేంద్ర చమురు శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి తెలిపారు. ఉజ్వల పథకం కింద సిలిండర్ ధర రూ.503 నుంచి రూ.553కు చేరింది. విజయవాడలో సిలిండర్ ధర రూ.825.50 నుంచి రూ.875.50కి పెరిగింది.

# విద్యార్థులపై కేసుల ఉపసంహరణ

(మొదటి పేజీ తరువాయి)

చర్చించిన తర్వాత ప్రభుత్వం ఈ కీలక నిర్ణయాలు తీసుకుంది. విద్యార్థులపై పెట్టిన కేసులను ఉపసంహరించాలని పోలీసు అధికారులకు ఆదేశాలిచ్చినట్లు సమా వేశానంతరం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. బలగాల ఉపసంహరణపై వీసీ అభిప్రాయం కోరుతూ లేఖ కూడా రాసినట్లు తెలిపారు. ఆదివారం హెచ్‌సీయూ విద్యార్థులు,అధ్యాపకులు, సివిల్ సొసైటీ ప్రతినిధులతో సుదీర్ఘంగా చర్చించిన మీనాక్షి నటరాజన్.. సోమవారం మంత్రుల కమిటీ సభ్యులైన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబులతో సమావేశమయ్యారు. సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి, అధ్యాపక సంఘం ప్రతినిధులు ప్రొఫెసర్ భూక్యానాయక్, ప్రొఫెసర్ సౌమ్య దేచమ్మ, ప్రొఫెసర్ శ్రీపర్ణదాస్, వివిధ సంఘాల ప్రతినిధులు సంధ్య, సజయ, విస్సా కిరణ్‌కుమార్, ఇమ్రాన్ సిద్దిఖీ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ అంశం ప్రస్తుతం సుప్రీంకోర్టులో ఉన్నందున, భూముల నేపథ్యంపై కాకుండా.. విద్యార్థులతో నెలకొన్న వివాద పరిష్కారంపై మాత్రమే చర్చించాలని నిర్ణయించారు. విద్యార్థులు, అధ్యాపకులు తన వద్ద ప్రస్తావించిన అంశాలను మీనాక్షి నటరాజన్ వివరించారు. జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉన్న ఇద్దరితోపాటు విద్యార్థులందరిపైనా కేసులను ఎత్తేయడం, పోలీసు బలగాల ఉపసంహరణ వంటి చర్యలతో సామరస్య వాతావరణం ఏర్పడుతుందన్న అభిప్రాయం వ్యక్తమైంది. దీంతో మంత్రుల కమిటీ వెంటనే నిఘా విభాగం డీజీ, సైబరాబాద్ పోలీసు కమిషనర్, అదనపు అడ్వొకేట్ జనరల్ తదితరులను పిలిపించి.. న్యాయపరంగా ఎలాంటి ఇబ్బందులు రాకుండా కేసుల ఎత్తివేతకు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. పోలీసు భద్రత కావాలని వర్సిటీనే కోరినందున వీసీ అభిప్రాయం తెలుసుకుని బలగాల ఉపసంహరణకు చర్యలు తీసుకోవాలని సూచించింది. ఈ మేరకు సమావేశం ముగిసిన వెంటనే ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.. వీసీకి లేఖ రాశారు.

*** ప్రస్తుతం ఆ భూముల్లోకి అనుమతి లేదు**

సుప్రీంకోర్టు సాధికార కమిటీ.. వర్సిటీ క్యాంపస్‌ను సందర్శించడానికి ముందే 400 ఎకరాల కంచ గచ్చిబౌలి భూమిలో నష్టం అంచనా, జీవవైవిధ్య సర్వే నిర్వహించడానికి నిపుణులైన అధ్యాపకులు, పరిశోధకులకు అనుమతివ్వాలని ఈ సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు కోరారు. కానీ వివాదం సుప్రీంకోర్టులో ఉన్నందున న్యాయస్థానం తదుపరి ఆదేశాలు జారీ చేసేవరకు ఎవరినీ సర్వేకు అనుమతించలేమని మంత్రుల కమిటీ స్పష్టంచేసింది. సుప్రీంకోర్టు ఆదేశం ప్రకారం.. 400 ఎకరాల భూమి పరిరక్షణకు పోలీసుల పహారా తప్పనిసరని, క్యాంపస్‌లోని మిగిలిన ప్రాంతాల్లో ఉన్న బలగాలను.. వీసీ స్పందన అనంతరం ఉపసంహరించుకుంటామంది. స్వయం ప్రతిపత్తి, బోధన, పరిశోధన లక్ష్యాల కోసం హెచ్‌సీయూ సురక్షితంగా ఉండాలని తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా కోరుకుంటోందని పేర్కొంది. విద్యార్థులు కోరినట్లుగా వర్సిటీని సందర్శించడానికి మంత్రుల కమిటీ సానుకూలంగా ఉందని.. కానీ సుప్రీంకోర్టు విచారణలో ఉన్నందున ఇప్పటికిప్పుడు వర్సిటీకి రాలేమని సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులకు మంత్రులు వివరించారు.

# ఆరోగ్య భాగ్యం

**సమయం న్యూస్, అమరావతి :** ప్రతి శాసనసభ నియోజక వర్గ కేంద్రంలోనూ ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య విధానం (పీపీపీ) లో కనీసం 100 నుంచి 300 పడకలతో మల్టీ స్పెషాలిటీ లేదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ప్రస్తుతం 70 నియోజకవర్గాల్లో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు ఉన్నాయని, మిగతా 105 చోట్ల ప్రాధాన్య క్రమంలో ఏర్పాటు చేస్తామని చెప్పారు. వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) విధానంలో అవసరమైన రాయితీలు ప్రభుత్వం అందజేస్తుందని సోమవారం సచివాలయంలో విలేకరుల సమావేశంలో సీఎం తెలిపారు. ''స్థలం రాయితీపై ఇస్తాం. మారుమూల, వెనుకబడిన ప్రాంతాల్లో ఏర్పాటయ్యే ఆసుపత్రులకు ఎక్కువ రాయితీలు అందజేస్తాం. ఎన్టీఆర్ వైద్య సేవ కింద 50 శాతం రోగుల్ని ఆసుపత్రులకు పంపుతాం. అవుట్ పేషెంట్లకూ ఈ పథకాన్ని వర్తింపజేస్తాం'' అని సీఎం వివరించారు. రాష్ట్రంలో వివిధ వ్యాధులతో బాధపడుతున్నవారిలో 80 శాతం మంది... గుండె జబ్బులు, మధుమేహం, శ్వాసకోశ సమస్యలు, క్యాన్సర్, కిడ్నీ సమస్యలు వంటి 10 ప్రధాన రోగాలతోనే సతమతమవుతున్నారని తెలిపారు. మంచి ఆహారపు అలవాట్లు, జీవనశైలి మార్పులు, వ్యాయామం ద్వారా చాలా వ్యాధుల్ని ముందే నివారించేందుకు, ఆసుపత్రుల్లో రోజుల తరబడి గడపాల్సిన అవసరం లేకుండా ఆన్‌లైన్‌లోనే వైద్యుల సలహాలు అందజేస్తూ రియల్‌టైమ్‌లో పర్యవేక్షించేందుకు, ఆసుపత్రుల్లో మెరుగైన చికిత్స అందజేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలవారీగా ఎక్కడ ఏ వ్యాధులు ఎక్కువగా ఉన్నాయో, వాటికి కారణాలేంటో వివిధ సర్వేల ఆధారంగా ఆయన వివరించారు. పిల్లలకు పాఠశాల స్థాయి నుంచి మెరుగైన ఆహారపు అలవాట్లు, మంచి జీవన విధానాన్ని సిలబస్‌గా చేరుస్తామని తెలిపారు.

*** ప్రతి వ్యాధికి ఒక్కో సలహాదారు, ప్రత్యేకాధికారి**

ప్రజల్ని ప్రధానంగా వేధిస్తున్న 10 వ్యాధుల్లో ప్రతిదానికీ దేశ, విదేశాల్లో నిపుణులైన ప్రముఖుల్ని సలహాదారులుగా నియమిస్తామని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న అత్యుత్తమ వైద్యుల్ని ఇన్‌ఛార్జిగా నియమిస్తామని తెలిపారు. 'క్యాన్సర్‌కు నోరి దత్తాత్రేయుడిని సలహాదారుగా పెట్టినట్టే, ప్రతి వ్యాధికీ ఒకర్ని నియమిస్తాం. వారి ఆధ్వర్యంలో కమిటీలు ఉంటాయి. ఆయా వ్యాధుల నివారణ, పర్యవేక్షణకు వారు వ్యూహాలు రూపొందిస్తారు' అని సీఎం తెలిపారు. రాజధాని అమరావతిలో.. మెగా గ్లోబల్ మెడిసిటీ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తామని చంద్రబాబు చెప్పారు. 'కేంద్ర ప్రభుత్వం దేశంలో పీపీపీ విధానంలో 25 మెడిసిటీలు ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. 100 ఎకరాల్లో ఆస్పత్రులు, 40 ఎకరాల్లో నివాస భవనాలు, 40 ఎకరాల్లో వాణిజ్య భవనాలు, 20 ఎకరాల్లో సేవా కేంద్రాలు.. ఇలా మొత్తం 200 ఎకరాల్లో ప్రాజెక్టు నెలకొల్పాలన్నది ప్రతిపాదన. ప్రధాని మోదీ ఖతార్ పర్యటనకు వెళ్లినప్పుడు.. మెడిసిటీ ప్రాజెక్టుల్లో 10 బిలియన్ డాలర్ల పెట్టుబడులకు ఆ దేశం ఆసక్తి చూపింది. అమరావతిలో మెడిసిటీ ప్రాజెక్టుపై ఖతార్‌తోనూ చర్చలు జరుపుతాం' అని తెలిపారు.


*** రాష్ట్రమంతా డిజిటల్ హెల్త్ నెర్వ్ సెంటర్లు**

కుప్పం నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్టుగా జూన్ 15న డిజిటల్ హెల్త్ నెర్వ్ సెంటర్ ప్రారంభిస్తున్నట్టు సీఎం తెలిపారు. రెండో దశలో ఆరు నెలల్లో చిత్తూరు జిల్లాలోని మొత్తం 31 మండలాల్లో దీనిని అమలు చేస్తామని, 26 నెలల్లో మొత్తం 26 జిల్లాల్లోనూ ప్రాజెక్టు అందుబాటులోకి తెస్తామని సీఎం వివరించారు. ఆయుష్మాన్ భారత్ కింద ప్రజలందరికీ హెల్త్ కార్డులు రూపొందించి, వాటిని డిజి లాకర్‌లో భద్రపరుస్తామన్నారు. భవిష్యత్తులో వారు వైద్యం కోసం ఎక్కడ ఏ వైద్యుడి దగ్గరకు వెళ్లినా వారి మెడికల్ రికార్డంతా డిజిటల్ లాకర్ నుంచి తేలిగ్గా పొందవచ్చునన్నారు. 'బాల్యం నుంచి హెల్త్‌కార్డులు రూపొందించి ట్రాక్ చేస్తాం. ప్రత్యేక యాప్ ద్వారా ప్రజలకు ఎప్పటికప్పుడు ఆరోగ్య సలహాలు అందజేస్తాం. స్పెషలిస్ట్ వైద్యుల సలహాలు అవసరమైనప్పుడు ఆన్‌లైన్‌లోను, ఆఫ్‌లైన్‌లోను అపాయింట్‌మెంట్‌లు ఏర్పాటు చేస్తాం. ఏఐ పరిజ్ఞానంతో సిబ్బందికి నిరంతరం శిక్షణ ఇస్తాం' అని తెలిపారు. మొబైల్ వాహనాల ద్వారా ఇంటి దగ్గరే 2025 రకాల ఆరోగ్య పరీక్షలు చేసి, ఆ డేటాను క్లౌడ్‌కు అనుసంధానం చేస్తామని, వైద్యులు ఎప్పుడు కావాలన్నా ఆన్‌లైన్‌లో ఆ సమాచారం తీసుకోవచ్చని తెలిపారు. ప్రజలకు అవసరమైన సమగ్ర వైద్య సలహాలు, సూచనలు ఇవ్వడంతో పాటు, మెరుగైన వైద్య సేవల్ని అందుబాటులోకి తేవడమే దీని లక్ష్యంగా ఆయన వివరించారు. టాటా ఎండీ, బిల్‌గేట్స్ ఫౌండేషన్ సంస్థలు ప్రపంచస్థాయి టెక్నాలజీ, అత్యుత్తమ విధానాల్ని అందజేస్తున్నాయని, వాటి ఆధారంగా మెరుగైన నమూనాను రూపొందిస్తున్నామని తెలిపారు.

# మహా సూర్య వందనం

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ప్రారంభించారు. అరకులోయ, పాడేరు డివిజన్ల పరిధిలోని 60 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు ఒకేసారి 108 రకాల సూర్య నమస్కారాలను 108 నిమిషాల్లో పూర్తిచేశారు. వరల్డ్ రికార్డ్ యూనియన్ సంస్థ ఈ కార్యక్రమాన్ని రికార్డు చేసి, ధ్రువపత్రం అందజేసింది.



# శంషాబాద్.. జిందాబాద్

(మొదటి పేజీ తరువాయి)

వారి సంఖ్య గరిష్ఠంగా 20 లక్షలే కాగా.. ఈ మూడు నెలల్లో ఏకంగా 74 లక్షల మంది రాకపోకలు సాగించడం విశేషం. ఈ విషయంలో హైదరాబాద్.. జనాభాలో ముందున్న మెట్రో నగరాలు చెన్నై, కోల్‌కతాలను దాటేసింది. అలాగే తన రోజువారీ గరిష్ఠ సగటు ప్రయాణికుల సంఖ్య 75 వేలను కూడా శంషాబాద్ జనవరి 18న అధిగమించింది. ఆ ఒక్కరోజే 94 వేల మంది ఇక్కడి నుంచి రాకపోకలు సాగించారని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) అధికారికంగా వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందినవారు కూడా విదేశీ ప్రయాణాలకు ఈ విమానాశ్రయాన్ని ఎంచుకోవడం, హైదరాబాద్‌లో తరచూ జాతీయ, అంతర్జాతీయ సదస్సులు జరుగుతుండటం వంటి పరిణామాలు ప్రయాణికుల వృద్ధికి దోహదపడుతున్నాయి.

*** విదేశాలకూ.. అత్యధిక ప్రయాణాలు..**

ఇక్కడి నుంచి దుబాయ్, దోహా, అబుధాబి సహా పలు విదేశీ నగరాలకు వెళ్లేవారూ గణనీయంగా ఉంటున్నారు. దుబాయ్‌కి నెలకు 93 వేల మంది, దోహాకు 42 వేల మంది, అబుధాబీకి 38 వేలు, జెడ్డాకు 31 వేలు, సింగపూర్‌కు 31 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారని విమానాశ్రయ అధికారులు తెలిపారు.

# ఉద్యోగాలు కోల్పోయిన టీచర్ల తరపున పోరాడతా

కోల్‌కతా: సుప్రీంకోర్టు ఇటీవల వెలువరించిన తీర్పు కారణంగా ఉద్యోగాలు కోల్పోయిన టీచర్లలో 'అర్హులైన అభ్యర్థుల' హక్కులను కాపాడతానని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పేర్కొన్నారు. తాను జీవించి ఉన్నంతకాలం వారికోసం పోరాడతానని, జైలుకు వెళ్లాల్సి వచ్చినా పోరు కొనసాగిస్తానని స్పష్టంచేశారు. సర్వోన్నత న్యాయస్థానం తీర్పు కారణంగా ప్రభావితమైన టీచర్లు, బోధనేతర సిబ్బందితో సోమవారమిక్కడి నేతాజీ స్టేడియంలో మమతా బెనర్జీ సమావేశం నిర్వహించారు. ''ప్రభుత్వం ఎలాంటి తొలగింపు లేఖలు పంపలేదు. కాబట్టి మీరు మీ పనిచేసుకోండి. ఈ సమయంలో స్వచ్ఛందంగా పనిచేయడానికి మీకు స్వేచ్ఛ ఉంది. నేను జైలుకు వెళ్లాల్సి వచ్చినా అర్హులైన వ్యక్తులు ఉద్యోగం కోల్పోకుండా నా ప్రాణం ఉన్నంత వరకు పోరాటం కొనసాగిస్తా. ఇదే నా వాగ్దానం'' అని పేర్కొన్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి అభిషేక్ మను సింఘ్వీ, కపిల్ సిబల్, రాకేశ్ ద్వివేదీ, కల్యాణ్ బెనర్జీ, ప్రశాంత్ భూషణ్‌లతో న్యాయవాదుల బృందాన్ని ఏర్పాటుచేసినట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ బృందం రాష్ట్ర ప్రభుత్వం, ఉద్యోగాలు కోల్పోయిన అభ్యర్థుల తరపున సుప్రీంకోర్టులో వాదనలు వినిపిస్తుందని తెలిపారు. ''తీర్పుపై వివరణ, సవరణలను కోరడంతోపాటు చట్టపరమైన అన్ని మార్గాలను అన్వేషిస్తాం. మా ప్రభుత్వంపై నమ్మకం ఉంచండి. మేం ప్లాన్ ఏ, బీ, సీ, డీ, ఈలతో సిద్ధంగా ఉన్నాం'' అని చెప్పారు.

# సుంకాలపై తగ్గేదే లేదు

(మొదటి పేజీ తరువాయి)

మార్కెట్లు పడిపోవాలని కోరుకోవడం లేదు. కానీ కొన్నిసార్లు కొన్ని నయం చేసుకోవాలంటే ఔషధాలను వాడాల్సిందే' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. 'గట్టిగా నిలవండి. ధైర్యంగా ఉండండి. ఓపికగా ఉండండి.. గొప్ప ఫలితాన్ని సాధించబోతున్నాం' అని సోమవారం అమెరికా ప్రజలనుద్దేశించిన ట్రంప్ వ్యాఖ్యానించారు. వడ్డీ రేట్లను తగ్గించాలని ఫెడరల్ రిజర్వుకు సూచించారు. అయితే సుంకాల నేపథ్యంలో ద్రవ్యోల్బణం పెరుగుతోందని, వడ్డీ రేట్ల తగ్గింపుపై కొంత కాలం ఎదురుచూడాల్సి ఉందని ఫెడరల్ రిజర్వు ఛైర్మన్ జెరోమ్ పావెల్ స్పష్టం చేశారు.

**50 దేశాలు సంప్రదించాయ్**

సుంకాల ఎత్తివేతపై చర్చల కోసం తమను 50 వరకూ దేశాలు సంప్రదించాయని అమెరికా అధికారులు వెల్లడించారు. దీనిపై ట్రంప్ స్పందించారు. 'నేను చాలా మంది నేతలతో మాట్లాడా. ఐరోపా, ఆసియా తదితర ప్రపంచ దేశాల నేతలంతా నాతో మాట్లాడారు. వారంతా అమెరికాతో ఒప్పందానికి సిద్ధంగా ఉన్నారు. వారికి నేను ఒకటే చెప్పా. మీ దేశంతో మా దేశానికి సుంకాల లోటు ఉండటానికి వీల్లేదు. నా దృష్టిలో లోటంటే నష్టమే. అందుకే మిగులు సాధించాలని ప్రయత్నిస్తున్నాం. కనీసం సమానత్వం సాధించాలనేది మా లక్ష్యం' అని ట్రంప్ పేర్కొన్నారు.

*** సంక్షోభం తప్పదు: గోల్డ్‌మన్ శాక్స్**

ట్రంప్ సుంకాలను తగ్గించినా ప్రస్తుత పరిస్థితుల్లో ఆర్థిక సంక్షోభం తప్పదని ఆర్థిక సేవల సంస్థ గోల్డ్‌మన్ శాక్స్ అంచనా వేసింది. ఆర్థిక వృద్ధి రేటు మందగించిందని, విదేశీ వినియోగదారుల బాయ్‌కాట్‌తోపాటు విధానాల్లో అస్పష్టతతో మూలధన వ్యయంలో క్షీణత నమోదు కావడం ఖాయమని పేర్కొంది.

# ప్రజల కోసం మా ఇంటి తలుపులు తెరిచే ఉంటాయి

**సమయం న్యూస్, తాడేపల్లి :** మంగళగిరి నియోజకవర్గ ప్రజల కోసం మా ఇంటి తలుపులు 24 గంటలూ తెరిచే ఉంటాయని విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలంలోని కొలనుకొండ, ఉండవల్లి, పెనుమాక, తాడేపల్లి పద్మశాలి బజారు, ఇప్పటం గ్రామాల్లోని ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్న 624 మందికి 'మన ఇల్లుమన లోకేశ్' కార్యక్రమం కింద శాశ్వత హక్కు కల్పిస్తూ ఆయన పట్టాలు అందజేశారు. లబ్ధిదారులను ఆప్యాయంగా పలకరిస్తూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వేదికపైకి రాలేని వారి వద్దకు స్వయంగా వెళ్లి పట్టాలు ఇచ్చారు. మంగళగిరిలో సోమవారం జరిగిన కార్యక్రమంలో తొలుత ఆయన మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. మంగళగిరిలో గతంలో ఓటమి పాలైనప్పుడు అందరూ ఎగతాళిగా మాట్లాడారని.. 2024లో భారీ మెజారిటీతో గెలిపించి ఇక్కడి ప్రజలు వారికి రీసౌండ్ మోగేలా సమాధానం ఇచ్చారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే మంగళగిరిలో పేదలకు ఉన్నచోటనే ఇళ్ల పట్టాలు ఇచ్చేలా తాను జీవో తీసుకొచ్చానని, ఈ ఫలాలు త్వరలో రాష్ట్రంలో ఉన్న పేదలందరికీ అందుతాయన్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 7 వేల మంది పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్నారని, వాటిని పరిశీలించి పట్టాలు ఇవ్వనున్నట్లు మంత్రి చెప్పారు. ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, ఏపీ వైద్యసేవలు, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్ధయ్య, తితిదే పాలక మండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# నాలాల్లోకి నిధులు.. రోడ్లపైకి నీళ్లు

**సమయం న్యూస్, హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలోని నాలాల్లో వరద నీరు సాఫీగా ముందుకెళ్లడానికి ఏటా వర్షాకాలానికి ముందే పూడికతీత పనులు చేపడుతుంటారు. వీటి కోసం జీహెచ్‌ఎంసీ అధికారులు ఏటా సగటున రూ.50 కోట్లు వెచ్చిస్తారు. ఈ లెక్కన గత నాలుగేళ్లలో రూ.200 కోట్ల వరకు ఖర్చు చేశారు. ఇంతగా ప్రజాధనం వ్యయమవుతున్నా... వరదనీటి వ్యవస్థ ఆశించినట్లుగా మెరుగుపడలేదని నగరంలో ఈ నెల 3న సాయంత్రం కురిసిన వర్షంతో తేటతెల్లమైంది. ఆ రోజు ఏకంగా 151 ప్రాంతాల్లో రోడ్లపై వరద ఉద్ధృతంగా పారింది. ద్విచక్ర వాహనాలు కొట్టుకుపోయాయి. ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్తంభించింది. ప్రయాణికులు మెట్రో స్టేషన్ల వైపు పరుగులు పెట్టారు. అర్ధరాత్రి దాటేంత వరకు ఇళ్లకు చేరుకోలేకపోయారు. కేవలం గంటపాటు కురిసిన వర్షానికే ఈ దుస్థితి తలెత్తడం ఆందోళన కలిగిస్తోంది. అత్యవసర నిధులు సరేసరి... వర్షం కురిస్తే జీహెచ్‌ఎంసీ అధికారులకు పండగే. రోడ్లపై నిలిచే నీటిని తోడేందుకు అత్యవసరం పేరిట పనులు చేపట్టి... తర్వాత బిల్లులు సమర్పిస్తున్నారు. ప్రతి సంవత్సరం ఈ పనులు పెరుగుతున్నాయే తప్ప తగ్గడం లేదు. పైగా వీటి వివరాలను బహిర్గతం చేయడంలేదు. పూడికతీత పనుల్లోనూ ఇష్టానుసారంగా నిధులు స్వాహా చేస్తున్నారని, తోడిన మట్టిని ఎక్కువ చేసి చూపిస్తున్నట్లు విమర్శలున్నాయి. తప్పుడు లెక్కలు ఉంటున్నాయని ప్రజాప్రతినిధులు సైతం ఆరోపిస్తున్నారు. ప్రస్తుత ఏడాది కోసం ఇటీవల 203 పూడికతీత పనులకు టెండర్లను పిలిచారు. వాటిలో 9 టెండర్ల దశలో, 97 మొబిలైజేషన్ దశలో, 97 కొనసాగుతున్న దశలో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.



## పటాన్ చేరు ఆత్మ కమిటీ చైర్మన్ ని సన్మానించిన బొల్లారం మున్సిపల్ నాయకులు

జిన్నారం ఏప్రిల్ 7 (సమయం న్యూస్): సంగారెడ్డి జిల్లా పటాన్ చేరు నియోజకవర్గంలో గుమ్మడిదల మండలానికి చెందిన కొత్తపల్లి శ్రీని వాస్ రెడ్డి పటాన్ చెరు ఆత్మ కమిటీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి ని సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు బొల్లారం మున్సి పాల్ మాజీ కౌన్సి లర్ వి. చంద్ర రెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. చైర్మన్ మరియు డైరెక్టర్లకు శుభాకాంక్షలు తెలియ జేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఐ ఎన్ టి యు సి ఉపాధ్యక్షుడు పి .లక్ష్మారెడ్డి , మాజీ కో ఆప్షన్ మెంబర్ మునీర్, మాజీ ఎంపిటిసి రాజు, నాయకులు మహేందర్ రెడ్డి, సంపత్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి , వి.వరప్రసాద్ రెడ్డి, వెంకటయ్య, చక్రపాణి, రాజగోపాల్, పాండు, భాస్కర్ ,మధుకర్ రెడ్డి నాయ కులు కార్యకర్తలు పాల్గొన్నారు .

# కమ్మ సంఘం వారి నూతన భవన, ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ చేసిన నాయకులు





బోధన్, 7 ఏప్రిల్ సమయం న్యూస్ : బోధన్ పట్టణంలోని కమ్మ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన మంజీరా ఫంక్షన్ హాల్ ను, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ కమ్మ సేవా సంఘాల సమైక్య అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర ప్రజా పద్దుల కమిటీ చైర్మన్, శేర్లింగంపల్లి నియోజకవర్గ సభ్యులు అరికెపూడి గాంధీ, విశిష్ట అతిధులుగా మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు, ప్రత్యేక అతిథిలుగా రాష్ట్ర కమ్మ సంఘ గౌరవాధ్యక్షులు చలసాని వెంకటేశ్వరరావు, మాజీ శాసనసభ్యులు నల్లమోతు భాస్కరరావు, గౌరవ అతిథిలు గా రాష్ట్రం మాజీ హస్తకళా చైర్మన్ మమ్మలనేని అమర్నాథ్ బాబు, తెలంగాణ రాష్ట్ర మహిళా కార్పొరేషన్ చైర్మన్ అట్లూరి రమాదేవి, ఉదయ్ కన్స్ట్రక్షన్ నిర్వాహకులు ముమ్మలనేని రాజశేఖర్, తదితర ప్రముఖులు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ రోజున కమ్మ సంఘం ఆధ్వర్యంలో నూతన భవనాన్ని, విగ్రహ ఆవిష్కరణ చేయడం ఎంతో సంతోషంగా ఉందని, ఇలాగే ఎప్పటికీ వీరందరూ కలసికట్టుగా ఉండి, ఇతరులకు ఆదర్శప్రాయులుగా నిలవాలని, ప్రజలకు ఉపయోగపడేలా ఇలాంటి మంచి కార్యక్రమాలు చేపడుతున్న బోధన్ కమ్మ సంఘం నాయకులకు అభినందనలు తెలిపారు. రానున్న రోజుల్లో వీరి ఆధ్వర్యంలో మరిన్ని మంచి ప్రజా ఉపయోగకర కార్యక్రమాలను మరిన్ని చేపట్టాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని అన్నారు. ఇట్టి కార్యక్రమంలో కమ్మ సంఘం నాయకులు శివన్నారాయణ, వెంకట్, వెంకటేశ్వర్లు, భాస్కర్, రఘు, గాంధీ, శ్రీరామ్ మారుతి, హనుమంతరావు అద్వకేట్ తదితర కమ్మ సంఘ ప్రముఖులు, మహిళలు పాల్గొనడం జరిగింది.



## ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలి

*** జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

భూపాల్ పల్లి ఏప్రిల్ 07( సమయం న్యూస్): సోమవారం ఐడిఓసి కార్యాలయంలోని మొదటి అంతస్తులో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గృహ నిర్మాణ శాఖ అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తలపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేసి త్వరిత గతిన గ్రౌండింగ్ చేయాలని హౌసింగ్ అధికారులకు సూచించారు. ఎంపికైన లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టి గడువులోపు పూర్తి చేయాలని అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయ లక్ష్మి, హౌసింగ్ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ లోకిలాల్, డి.ఈ శ్రీకాంత్, ఏఈ రాజ లింగం తదితరులు పాల్గొన్నారు.

# మహిళల శక్తికి టెక్నాలజీ తొడైతే ... సమాజం అభివృద్ధి చెందుతుంది

*** జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు**

సంగారెడ్డి ఏప్రిల్ 07( సమయం న్యూస్) : సోమవారం నమో డ్రోన్ దిది కిసాన్ డ్రోన్ ఆపరేటర్ శిక్షన పై హేటిరో,సింక్రో,ఫ్లయింగ్ వెడ్జ్, కంపెనీల అధికారులతో కలెక్టర్ ఛాంబర్ లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ మహిళల శక్తికి టెక్నాలజీ తొడైతే ,సమాజం అభివృద్ధి చెందుతుందని మహిళలు టెక్నాలజీ పై అవగాహన కల్గి ఉండడం వల్ల మహిళలకు,మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు సాధి కారత కల్పించడం ,వ్యవసాయ, ఉద్యాన సేవలు అందించడానికి డ్రోన్ లు అందించడం లక్యం గా పెట్టుకొని మహిళలకు అదనపు ఆదాయాన్ని పొంది ఆర్థిక సాధికారత,స్థిరమైన జీవనోపాధికి దోహదం పడుతుందని కలెక్టర్ తెలిపారు. డ్రోన్ శిక్షణ ట్రైనింగ్ ను రాష్ట్ర స్థాయి లో మొదటి సారిగా మన జిల్లా లో ప్రారంభించామన్నారు. ఈ ట్రైనింగ్ ను క్షేత్రస్థాయిలో అమలు పరచుటకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ ట్రైనింగ్ ను క్షేత్రస్థాయిలో అమలుపరచుటకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. త్వరిత గతిన మహిళలకు డ్రోన్ లను బ్యాంక్ నుంచి కానీ శ్రీనిధి ద్వారా రుణాలు అందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్య



క్రమంలో డి ఆర్ డి ఓ జ్యోతి, అదనపు డి ఆర్ డి ఓ జంగారెడ్డి వివిధ కంపెనీల ప్రతినిధులు హేటిరో హెడ్ సుధాకర్, సింక్రో సర్వీస్ హెడ్ నరసింహ, ఎరోస్పేస్ హెడ్ విజయ్ కుమార్, పాల్గొన్నారు.



## రాజీవ్ యువ వికాసం ఎంపిక, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రక్రియ వేగవంతం చేయండి

*** జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

*** టెలికాన్ కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు దిశ నిర్దేశం**

మెదక్ ఏప్రిల్ 07(సమయం న్యూస్) : సోమవారం సమీకృత కలె క్టరేట్ కార్యాలయం నుండి మున్సిపల్ కమిషనర్లు ఎంపీడీవోలతో ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ వికాసం పై అదనపు కలెక్టర్ నగేష్ కలిసి టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రక్రియ లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని ఈ ప్రక్రియలో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా పనిచేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవోలు, తదితరులున్నారు

# ఎమ్మెల్యే జయకృష్ణకు అభినందనలు..

*** అభ్యుదయ రైతు ఖండాపు ప్రసాదరావు**








గత 50 సంవత్సరాలుగా వెలగ వాడ నుంచి పిఆర్ రాజుపేట రహదారి గురించి తీవ్ర పోరాటం చేసిన నేటికి ఆ కల నెరవేరిందని అభ్యుదయ రైతు ఖండాపు ప్రసాదరావు తెలిపారు. ఎట్టకేలకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూటమి ప్రభుత్వ హయాంలో గ్రామీణ రోరడ్లకు మోక్షం కల్పించే దిశలో ఎట్టకేలకు ఈ రోడ్డు 45 లక్షల వ్యయంతో పూర్తి చేయడం కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. పాలకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ చొరవతో 50 ఏళ్ల కల ఫలించింది. అదే విధంగా వెలగవాడ రుద్రిపేట కలిపే రోడ్డులో బహిరంగ మల విసర్జన కోసం ఉపయోగి స్తున్నారు. ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ సురక్ష కార్యక్రమాలు ఉన్నప్పటికీ అటువంటి అనాగరిక పరిస్థితి ఉన్నం దున సందర్శకులు రుద్రిపేటకు భౌతికంగా రావడానికి ఇష్టపడరు. ఈ సమస్యలను ఇప్పటికి సంబంధించిన అధికారులు, స్థానిక అధికారుల దృష్టికి తీసుకురాబడేంది కాబట్టి వెలగవాడ ప్రారంభ స్థలము వద్ద రోడ్డుపై బహిరంగ మలవిసర్జనను నివారించడానికి సరైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గారికి కోరుతున్నారు. అదే విధంగా గత సంవత్సరం క్రిద జలసంరక్షణ కింద పైపులు శిథిలావస్థ దశలో చేరుకొనక ముందే ఆ పని చేపట్టిఓట ఇంటింటి కుళాయి ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

## వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయండి

*** వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

హన్మకొండ ఏప్రిల్07( సమయం న్యూస్) : హనుమకొండ: వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని వివిధ అభివృద్ధి పనులను సంబంధిత శాఖల అధికారులు త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు చేపట్టాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని వివిధ అభివృద్ధి పనులపై నగర మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ వెంకట్రామ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, కుడా వైస్ చైర్మన్ అశ్విని తానాజీ వాకడే లతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా భద్రకాళి చెరువు పూడికతీత పనులు, భద్రకాళి మాఢవీధుల నిర్మాణ పనుల పురోగతి, జవహర్ లాల్ నెహ్రూ స్టేడియం లో జరుగుతున్న అభివృద్ధి పనులు, రోడ్ల విస్తరణ పనులు, ఇందిరమ్మ ఇండ్లు, బిహెచ్కె పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు.

# సోలార్ పవర్, రీజినల్ రింగ్ రోడ్, మూసి పునర్జీవం, విద్య మా ప్రభుత్వ ప్రాధాన్యత రంగాలు

*** సింగపూర్ ప్రతినిధి బృందంతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**

హైదరాబాద్ ఎప్రిల్07( సమయం న్యూస్) : తెలంగాణతో ఆర్థిక సంబంధాల బలోపేతంపై ఆసక్తి: కాన్సుల్ జనరల్ ఎడ్గర్ పాంగ్ గ్రీన్ పవర్ , రీజనల్ రింగ్ రోడ్డు, మూసి పునర్జీవం, విద్య తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్య రంగాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో సింగపూర్ కాన్సుల్ జనరల్ ప్రతినిధి బృందంతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా సింగపూర్ కాన్సల్ జనరల్ ఎడ్గర్ పాంగ్ మాట్లాడుతూ తెలంగాణతో ఆర్థిక సంబంధాలు బలోపేతం చేసుకునేందుకు సింగపూర్ సంస్థలు ఆసక్తిగా ఉన్నాయని, డిప్యూటీ సీఎం సహకారం, సందేశం కావాలంటూ పాంగ్ కోరారు. గ్రీన్ ఎనర్జీ , రీజినల్ రింగ్ రోడ్డు, మూసి పునర్జీవనం, విద్య తమ ప్రభుత్వ ప్రాధాన్యత రంగాలని ఈ రంగాల్లో సింగపూర్ సంస్థలతో కలిసి పని చేసే అంశంపై చర్చించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆసక్తిగా ఉందని డిప్యూటీ సీఎం తెలిపారు. కొత్త గ్రీన్ పవర్ పాలసీలో భాగంగా సోలార్, హైడ్రో, పంపుడ్ స్టోరేజీ విభాగాలపై దృష్టి పెట్టినట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ తో రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా



ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నట్టు సింగపూర్ ప్రతినిధి బృందానికి వివరించారు. మొదటి దశలో 6,00 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు విడుదల చేశామని, ప్రతి పాఠశాలను 25 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్నాము ఇది రాష్ట్ర ప్రభుత్వ డ్రీమ్ ప్రాజెక్టు అని వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఒక నగర రాజ్యం, అత్యధికంగా పట్టణాలు ఉన్నాయని పట్టణ అభివృద్ధి పైన రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టినట్టు తెలిపారు. సమావేశంలో సింగపూర్ పొలిటికల్ కాన్సుల్ వైష్ణవి వాసుదేవన్, సింగపూర్ హై కమిషన్ ప్రథమ ఆర్థిక సెక్రటరీ, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## రాజ్యాంగ పరిధిలో.. వక్ఫ్ చట్టం !

రాజ్యాంగ ప్రతిని చేతబట్టి.. ఎన్నికల్లో ప్రచారంలో పాల్గొన్నప్రతిచోటా.. రాజ్యాంగానికి బిజెపి తూట్లు పొడుస్తోందంటూ వ్యాఖ్యానించిన కాంగ్రెస్ ఎంపి రాహుల్ గాంధీ....వక్ఫ్ చట్టంలో రాజ్యాంగ ఉల్లంఘనలపై మాత్రం ఎక్కడా మాట్లాడలేదు. సరికాదా ఇది రాజ్యాంగ వ్యతిరక చర్య అంటూ వక్ఫ్ బిల్లుపై సోనియా పరివారం మాట్లారు. నిజంగా పాత వక్ఫ్ చట్టం ప్రకారం రాజ్యాంగ చర్యలు లేవు. వారు తీసుకున్న నిర్ణయా లను ప్రశ్నించలేం. అందుకే ఇంతకాలం ఇష్టారాజ్యంగా వక్ఫ్ రాజ్యాంగం నడిచింది. ముస్లింల అభివృద్ధిని విస్మరించారు. అందుకే దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో వక్ఫ్ చట్టానికి అనుకూలంగా ముస్లింలే ప్రదర్శనలు నిర్వహించారు. మోడీ చర్యలను సమర్థించారు. పార్లమెంటులో సైతం ఓవైసీ తప్ప పలువురు ముస్లిం ప్రజాప్రతినిధులు బిల్లును సమర్థించారు. ఈ క్రమంలో వివిధ దేశాల్లో ఉన్న చట్టాలను పరిశీలించి, వక్ఫ్ చట్టంలో మార్పులను, అదికూడా రాజ్యాంగానికి లోబడి తీసుకుని రావడం ఆహ్వానించదగ్గ విషయం. దీనిని దేశం యావత్తూ ఆమోదించినా, ముస్లిం పెద్దలు అంగీకరించినా,ఓటు బ్యాంక్ రాజకీయాలకు అలవాటు పడిన కాంగ్రెస్ స్కంధావారం మాత్రం తప్పుడపుతూనే ఉంది. చట్టసభలు చట్టాలను చేయవచ్చు, చేయక పోవచ్చు.. కాలానుగుణంగా అవసరాల బట్టి చట్టాలను సవరించవచ్చు. అయితే ఆ పని చేసేటప్పుడు చట్టసభ సభ్యులు అవసరాలు గుర్తించి చర్యలు తీసుకోవాలి. ఇలా రాజ్యాంగాన్ని మనం పలుమార్లు సవరించుకున్నాం. విభజన ఎజెండా అంటూ కాంగ్రెస్, ఓవైసీ తదితరులు చేస్తున్న వాదనలో పసలేదు. ఇందులో ఎదురయ్యే అభ్యంతరాలను భవిష్య దృక్పథంతో పరిష్కరించే సూత్రం అవలంబించడం ద్వారా మోడీ ప్రభుత్వం దార్శనికతను ప్రదర్శించింది. ఇంకా కఠిన నిర్ణయాలు ఉండాలని మహారాష్ట్రకు చెందిన ఓ హిళా ఎంపి డిమాండ్ చేయడం గమనించాలి. అనేక వైవిధ్యాలు కలిగిన భారత్ వంటి దేశంలో సమాజానికి మేలు చేసే విధానాలు అవలంబించడం మంచిది. అయితే దురదృష్టవశాత్తు ఇంతకాలం ఇలాంటి విపరీత పరిణామాలను కాంగ్రెస్ అవలంబించింది. కేవలం ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం చట్టాలను కూడా తమకు అనుకూలంగా మార్చుకున్న తీరును ఎండగట్టాల్సిందే. దేశవ్యాప్తంగా విస్తృత చర్చతోపాటు అధికార, విపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదాలకు దారితీసిన వక్ఫ్ సవరణ బిల్లు 2025 ఎట్టకేలకు పార్లమెంట్ ఆమోదం పొందిన తీరు దార్శనికతను చూపింది. వక్ఫ్ ఆస్తుల నిర్వహణ అనగా, ఇస్లాం మతం ప్రకారం మతపరమైన లేదా దాతృత్వ కార్యాల కోసం శాశ్వతంగా అంకితమిచ్చిన ఆస్తుల నిర్వహణ, వాటిని దుర్వినియోగం కాకుండా పరిరక్షించడం, ఆయా ఆస్తులను మతపరమైన లేదా దాతృత్వ ప్రయోజనాలకు వినియోగించడం తదితర అజమాయిషీకి సంబంధించిన చట్టం 1995లో తీసుకురావడమైంది. ఇది పూర్తిగా శాశ్వతంగా మతపరమైన ప్రయోజనాల కోసమే ఉద్దేశించబడిరదని చెప్పినా తదనంతరం దాని ఫలితాలు పరిశీలిస్తే కొందరికి ఆస్తులు కూడబెట్టేదిగా మారింది. అయితే ఈ చట్టం ఇస్లాం మత విశ్వాసాలను మించిపోయి న్యాయరహిత వక్ఫ్‌బోర్డులుగా మార్చివేసిందన్న ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా ముస్లింలు మాత్రమే వక్ఫ్‌బోర్డు పాలక వర్గాల్లో సభ్యులుగా ఉంటారు. ఈ చట్టంలోని సెక్షన్ 40 ప్రకారం ఎక్కడైనా ఏదైనా ఆస్తి వక్ఫ్ ఆస్తి అని నమ్మకం కలిగితే ఆ సమాచారాన్ని సేకరించే అధికారం వక్ఫ్‌బోర్డులకు ఉంటుంది.ఆపై నిర్ణయించే అధికారం కూడా ఉంటుంది. అంతేకాదు ఈ నిర్ణయాలను అమలు చేయాలని సంబంధిత జిల్లా మెజిస్ట్రేట్‌లను ఆదేశించే అధికారం కూడా ఈ బోర్డులకు ఉంటుంది. ఈ అధికారాలు బోర్డులు ఫిర్యాదు దారులుగా, దర్యాప్తు సంస్థలుగా, న్యాయ వ్యవస్థలుగా తయారు చేసింది. ఇది భారతీయ న్యాయ వ్యవస్థ నిబంధనలకు, ఆచరణలకు విరుద్ధంగా ఉంది. ఈ ప్రత్యేక అపరిమిత అధికారాలు దేశంలో అధిక శాతం మంది ప్రజలకు,ముస్లింలకు, ముస్లిమేతరులకు కూడా ఆందోళన కలిగించేదిగా తయారయ్యింది. తప్పనిసరి గా దీన్ని మార్చవలసిన అవసరం ఉందని గ్రహించిన ప్రభుత్వం కొత్త సవరణ బిల్లును తీసుకుని రావాల్సి వచ్చింది. ఇదేదోఆషామాషీగా చేయలేదు. జెపిసిని నియించారు. సవరనలను స్వాగతించారు. పార్లమెంటులో సుదీర్ఘ చర్చ తరవాత చట్టంగా మార్చారు. ఇప్పుడు కొత్తగా వచ్చిన వక్ఫ్ సవరణ బిల్లు పాత చట్టంలోని సెక్షన్ 40ను పూర్తిగా రద్దు చేసింది. ఇప్పుడు కొత్ చట్టం ప్రకారం ఏదైనా ఆస్తి వక్ఫ్‌ఆస్తి అనుకుంటే ప్రభుత్వ ఉన్నతాధికారి ముందు నిరూపించవలసి వస్తుంది. ఇంతకాలం అనేక చోట్ల ఇది వక్ఫ్ ఆస్తి అని ఆస్తులను గుంజుకున్న ఉదాహరణలు కోకొల్లలు. తమిళనాడులో ఇప్పుడు ఓ కేసులో కొంత భూమికి వక్ఫ్ నుంచి విముక్తి కలిగింది. సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్, రాష్ట్ర వక్ఫ్‌బోర్డుల వ్యవస్థల విషయంలో అపరిష్కృత విధానాలు కొత్త బిల్లులో చోటుచేసుకున్నాయి. ఇదివరకు చట్టంలో ఈ బోర్డుల్లో ముస్లింలే సభ్యులుగా ఉండేవారు. ఇస్లామిక్ మత విశ్వాసం ప్రకారం అంకితమైన ఆస్తులను పర్యవేక్షించేవారు. ఇప్పుడు కొత్త బిల్లు ప్రకారం ఈ బోర్డుల్లో ముస్లిమేతరులకు కూడా సభ్యులుగా చోటు కల్పించే వీలుంది. దీనివల్ల బోర్డులు మరింత సమర్ధవంతంగా పనిచేస్తాయని చెబుతున్నారు. ముస్లిం ప్రార్థనా స్థలాలపై హిందువుల వివాదాలు ఇప్పటికే ముసురుకుంటున్నాయి. వీటిని పరిష్కరించాల్సి ఉంది. ముస్లిం పాలకుల దాడుల వల్ల అనేక హిందూదేవాలయాలు ధ్వంసం అయ్యాయి. ఆస్తులు అన్యాక్రాంతం అయ్యాయి.వాటికి పరిష్కారం దక్కే అవకాశం కూడా వచ్చింది. ప్రతిపాదిత చట్టం ముస్లింల పట్ల వివక్షతను చూపిస్తుందని వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ ఎంపీ జావేద్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. అయితే రాజ్యాంగ పరిధిలో చట్టం చేసినందున దీనిని వ్యతిరేకించే అవకాశం ఉండదు.

# సౌత్ ఇండియా కు డేంజరే..!

సంఖ్యాబలంతో లోక్ సభ, రాజ్యసభలో వక్ఫ్ అమెండ్ మెంట్ బిల్లు 2025ను ఎన్డీఏ ప్రభుత్వం ఆమోదింపజేసుకున్నది. జేడీయూ, తెలుగుదేశం పార్టీ వంటి మిత్రపక్షాల సహకారంతో భారతీయ జనతాపార్టీ రెండు సభల్లోనూ బిల్ పాస్ అయ్యేలా జాగ్రత్తలు తీసుకున్నది. ఆ తర్వాత రాష్ట్రపతి ఆమోదం తెలపడంతో ఈ బిల్లు చట్టరూపం దాల్చింది. అయితే వక్ఫ్ బిల్లు విషయంలో దూకుడుగా వెళ్లిన బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ.. డీలిమిటేషన్ విషయంలోనూ అలాగే వ్యవహరించే అవకాశముంది ఎన్డీఏ, ఇండియా ఏ కూటమిలో ఉన్నా.. సౌత్ స్టేట్స్ కలిసికట్టుగా పోరాడకపోతే... దక్షిణాది రాష్ట్రాలకు, అక్కడి ప్రజలకు తీరని నష్టం జరిగే ప్రమాదముంది. 2011 లేదా 2025లో చేపడుతారని భావిస్తున్న జనాభా లెక్కల ప్రకారం పునర్విభజన జరిగితే ఎంపీ స్థానాల సంఖ్య 800 నుంచి 1000 వరకు పెరగొచ్చు. అయితే ఈ ప్రక్రియలో ఉత్తరాది రాష్ట్రాలు ఎంతో లాభపడుతుండగా, దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గే ప్రమాదమున్నది. దీంతో భవిష్యత్తులో దక్షిణాది గళానికి విలువలేకుండాపోతుంది.

### సీట్ల సంఖ్య ఇలా..

1951-52లో దేశ జనాభా 36 కోట్లు. అప్పుడు లోక్ సభ సీట్లు 489. పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన జరిగిన 1971లో దేశ జనాభా 54 కోట్లు. అప్పుడు సీట్ల సంఖ్యను 545కు పెంచారు. 1976లో కుటుంబ నియంత్రణ కార్యక్రమం జోరుగా సాగుతున్నది. తాము జనాభాను నియంత్రిస్తే లోక్ సభ స్థానాల సంఖ్య తగ్గే ప్రమాదముందని అప్పట్లోనే దక్షిణాది రాష్ట్రాలు అనుమానం వ్యక్తం చేశాయి. దీంతో 1976లో ఎమర్జెన్సీ సమయంలో లోక్ సభ సీట్ల సంఖ్యకు మరో 25 ఏళ్లపాటు 1971 జనాభా లెక్కలనే పరిగణనలోకి తీసుకోవాలని 42వ రాజ్యాంగ సవరణచేశారు. 2001లో నియోజకవర్గాల పునర్విభజన జరగాల్సి ఉన్నా.. అప్పట్లో ప్రధానిగా ఉన్నా వాజ్ పేయి 84వ రాజ్యాంగ సవరణ చేశారు. లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచకుండా పునర్ వ్యవస్థీకరణ చేశారు. కొన్ని జనరల్ స్థానాలను ఎస్సీ, ఎస్టీ వర్గాలకు కేటాయించి.. వారి ప్రాతినిధ్యం పెంచారు. లోక్ సభ సీట్ల సంఖ్య పెంపు అంశాన్ని 2026కి వాయిదా వేశారు. దీంతో మూడో సారి అధికారంలోకి వచ్చిన బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ 2026లో ఎలాగైనా నియోజకవర్గాలను పునర్విభజించాలని భావిస్తున్నది. ప్రస్తుతం 2011 సెన్సెస్ మాత్రమే అందుబాటులో ఉన్నాయి. కరోనా కారణంగా 2021 జనగణనను వాయిదా వేశారు. కేంద్ర ప్రభుత్వం 2025లో జనగణన చేస్తుందనే ప్రచారం సైతం జరుగుతున్నది. జనగణనకు ఇంకా ఏడాది సమయం ఉన్నందున, 2021లో చేపట్టాల్సిన జనగణనను పూర్తి చేసి నియోజకవర్గాలను పునర్విభజిస్తారా? లేదా 2011 డేటాను పరిగణనలోకి తీసుకొని పునర్విభజన చేస్తారా అనేది కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉన్నది.

### * ఉత్తరాది రాష్ట్రాలు లాభపడేది ఇలా..

ఉత్తర్‌ప్రదేశ్‌లో ప్రస్తుతం సీట్ల సంఖ్య 80. పునర్విభజనతో ఆ రాష్ట్రంలో సీట్ల సంఖ్య 160కి పైగా పెరిగే అవకాశముంది. అంటే సీట్ల సంఖ్య దాదాపు రెట్టింపు అవుతుంది. ఆ రాష్ట్ర ప్రాతినిధ్యం 14.7% నుంచి 16 శాతానికి పెరుగుతుంది. రాజస్థాన్ లో ప్రస్తుతం 25 ఎంపీ సీట్లు ఉండగా, అవి కూడా 52కి పెరుగుతాయని అంచనా. ఇక్కడ కూడా సీట్లు రెట్టింపు అవుతున్నాయి. అలాగే బిహార్, ఇతర ఉత్తరాది రాష్ట్రాల్లో సీట్లు కూడా గణనీయస్థాయిలో పెరిగే అవకాశాలున్నాయి.

### * దక్షిణాది నష్టపోయేది ఇలా..

1952లో పార్లమెంట్ స్థానాల సంఖ్య 489 కాగా, ఇందులో దక్షిణాది వాటా 25.35 శాతం. 1967లో సీట్ల సంఖ్య 522కి కాగా, దక్షిణాది వాదా 24.13 శాతానికి పడిపోయింది. 1977లో సీట్ల సంఖ్య 545 కు చేరగా, దక్షిణాది సీట్ల వాటా 23.85 శాతానికి పడిపోయింది. అయితే ప్రస్తుతం డీలిమిటేషన్ తో తెలంగాణ లోక్ సభ సీట్ల సంఖ్య 17 నుంచి 39కి పెరిగే అవకాశముంది. అంటే పెరుగుదల 48 శాతం మాత్రమే. దీని ద్వారా పార్లమెంటులో తెలంగాణ ప్రాతినిధ్యం 3.1 శాతం నుంచి 3.3 శాతానికి చేరుకుంటుంది. అదే ఆంధ్రప్రదేశ్ ను తీసుకుంటే సీట్ల సంఖ్య 25 నుంచి 52కు పెరుగుతుండగా, ఏపీ వాటా మాత్రం 4.6 శాతం నుంచి 4.3 శాతానికి పడిపోతుంది. తమిళనాడులో 28 శాతం సీట్లు పెరుగనుండగా.. కేరళలో కేవలం ఒక్క శాతం మాత్రమే సీట్లు పెరిగే అవకాశం ఉంది. ఇలా అయితే పార్లమెంటులో తమిళనాడు ప్రాతినిధ్యం 7.2 శాతం నుంచి 6.4 శాతానికి, కేరళ ప్రాతినిధ్యం 3.7 శాతం నుంచి 2.9 శాతానికి పడిపోతుంది.

### * ఆందోళనకు కారణాలేమిటి?

జనాభా ఆధారంగా డీలిమిటేషన్ జరిగితే ఉత్తరాదిలోని నాలుగైదు రాష్ట్రాల్లో సత్తా చాటగలిగిన పార్టీలు దేశంలో అధికారంలోకి వచ్చే అవకాశాలు ఎక్కువ. దీంతో దక్షిణాది రాష్ట్రాలు తమ హక్కులు కోల్పోయే ప్రమాదముంది. ఇప్పటికే జాతీయ భాష అంటూ హిందీని నెత్తిన రుద్దే ప్రయత్నం చేస్తున్నారు. అంతేకాకుండా నిధుల విషయంలోనూ మొదటి నుంచీ అన్యాయం జరుగుతున్నది. పార్లమెంటులో దక్షిణాది ప్రాతినిధ్యం తగ్గితే కేంద్రం నుంచి న్యాయం జరిగే అవకాశాలు చాలా తక్కువ.

### * పోరాడితేనే..

డీలిమిటేషన్ తో జరిగే నష్టంపై ఆందోళనలతో దక్షిణాదికి చెందిన మెజార్టీ పార్టీలు ఏకమై జేఏసీగా ఏర్పడి పోరాటానికి సిద్ధమయ్యాయి. ఇప్పటికే తమిళనాడులో అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించి నిర్వహించారు. తెలంగాణ, కేరళ, పంజాబ్ ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, పినరయి విజయన్, భగవంత్ మాన్, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీ.కె. శివకుమార్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇందులో పాల్గొన్నారు. ఒడిశా మాజీ సీఎం నవీన్ పట్నాయక్ సైతం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ మీటింగుకు హాజరయ్యారు. ఇక్కడ పలు తీర్మానాలను ఆమోదించి కేంద్రం ముందు ఉంచారు. ఇందులో ముఖ్యమైనది పార్లమెంట్ నియోజకవర్గాల సంఖ్యను మరో 25 ఏళ్లు మార్చకూడదు. అనంతరం డీలిమిటేషన్ ను వ్యతిరేకిస్తూ తెలంగాణ అసెంబ్లీ సైతం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. జేఏసీ రెండో సమావేశాన్ని తెలంగాణలో నిర్వహించడానికి నిర్ణయం తీసుకున్నారు. అయితే పార్లమెంట్ లో వక్ఫ్ బిల్లుకు మద్దతు తెలిపిన ఏపీకి చెందిన తెలుగుదేశం, జన సేనతోపాటు అనుకూలంగానో, వ్యతిరేకంగానో ఎలా ఓటు వేశారో తెలియని గందరగోళంలో ఉన్న జగన్ పార్టీ సైతం ఈ జేఏసీలో యాక్టివ్ గా కనిపించడం లేదు. సీట్ల వాటాలో దక్షిణాదికి నష్టం జరిగితే అందులో ఆంధ్రప్రదేశ్ కూడా ఉంటుందని ఆ రాష్ట్ర రాజకీయ పార్టీల నాయకులు గుర్తించాలి. లేకపోతే ఆయా పార్టీల అధినేతలు ప్రజల ముందు ముద్దాయిగా నిలబడాల్సి ఉంటుంది.

ఫిరోజ్ ఖాన్
సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్, 9640466464

# 2 లక్షల మంది ఏఐ ఇంజినీర్లను తయారు చేస్తాం

* **రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**



సమయం న్యూస్ , హైదరాబాద్

తెలంగాణ నుంచి రెండు లక్షల మంది ఏఐ ఇంజినీర్లను తయారు చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. కాన్సులేట్ జనరల్ ఆఫ్ సింగపూర్ 'ఎడ్గర్ పాంగ్' నేతృత్వంలో ఆ దేశ ప్రతినిధులు సోమవారం డా.బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. 'ఎమర్జింగ్ టెక్నాలజీస్' కు హబ్ గా తెలంగాణను మార్చేందుకు తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వారికి వివరించారు. ఈ రంగంలో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా తెలంగాణ యువతను తీర్చిదిద్దుతామన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో నెలకొల్పుతున్న ఫ్యూచర్ సిటీ, అక్కడే ఏర్పాటు చేయబోతున్న ఏఐ యూనివర్సిటీ గురించి తెలిపారు. ఫ్యూచర్ సిటీలో భాగస్వామ్యమయ్యేందుకు అనేక అంతర్జాతీయ సంస్థలు ముందుకొచ్చాయన్నారు. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ)కు హబ్ గా హైదరాబాద్ మారుతుందన్నారు. ఏడాది వ్యవధిలోనే ఐటీ, హాస్పిటాలిటీ, ఇతర రంగాలకు చెందిన 70 జీసీసీలు ప్రారంభమయ్యాయని చెప్పారు. తెలంగాణలో పారిశ్రామికాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. పరిశ్రమల ఏర్పాటును ఒక్క హైదరాబాద్ కే పరిమితం చేయకుండా... వరంగల్, కరీంనగర్ లాంటి నగరాలకు విస్తరించేలా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తున్నామన్నారు. తెలంగాణలో పరిశ్రమల ఏర్పాటుకున్న అనుకూలతలపై స్థానిక పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పించాలని ప్రతినిధుల బృందాన్ని కోరారు. టెక్నాలజీ, స్కిల్ డెవలప్ మెంట్, ఇతర అంశాల్లో సింగపూర్ ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సమావేశంలో కాన్సుల్ వైష్ణవి వాసుదేవన్, ఫస్ట్ సెక్రటరీ (ఎకానమిక్) వివేక్ రఘు రామన్, ఎంటర్ ప్రైజ్ సింగపూర్ రీజినల్ డైరెక్టర్ (ఇండియా - సౌత్) డేనిస్ టాం తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలి

* **కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**
* **ప్రజావాణి ఫిర్యాదులు :246**

కరీంనగర్ ఏప్రిల్ 7, సమయం న్యూస్ : ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే దరఖాస్తులకు అధిక ప్రాధా న్యత ఇచ్చి త్వరితగతిన పరిష్క రించాలని కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను అదనపు కలెక్టర్లతో కలిసి కలెక్టర్ స్వీకరిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు ప్రజావాణి ఆశ్రయిస్తున్నారని, వారి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అన్నారు. ప్రజావాణి పోర్టల్ లోని పెండింగ్ దరఖాస్తులను కూడా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 246 దరఖాస్తుల స్వీకరించగా వాటిని వెంటనే సంబంధిత అధికారులకు బదిలీ చేసి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మి కిరణ్, ప్రఫుల్ దేశాయి, డిఆర్ఓ వెంకటేశ్వర్లు, ఆర్డీఓ మహేశ్వర్, డిటిడిఓ పవన్ కుమార్ వివిధ జిల్లా స్థాయి




అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

* **పారిశుద్ధ్య కార్మికులందరికీ బీమా ప్రీమియం చెల్లించాలి**
* **కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**

జిల్లాలో పనిచేస్తున్న సుమారు 2700 పారిశుధ్య కార్మికులందరికీ బీమా ప్రీమియం చెల్లించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలను ఆదేశించారు. మరణించిన ఇద్దరు పారిశుధ్య కార్మికుల కుటుంబ సభ్యులకు సోమవారం ప్రజావాణి అనంతరం జిల్లా కలెక్టర్ చెక్కులు పంపిణీ చేశారు. ఇల్లందకుంట మండలం మల్యాల కు చెందిన గురుకొండ రాజబాబు, శ్రీరాముల పల్లెకు చెందిన తిరుపతి మరణించగా వారి కుటుంబ సభ్యులకు పి.ఎం.జె.జె.బి.వై పథకం ద్వారా మంజూరైన రూ.రెండు లక్షల చొప్పున చెక్కులను అందజేశారు. ఎందుకు సంబంధించిన ప్రీమియం గత ఏడాది జిల్లా యంత్రాంగమే చెల్లించింది. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత సంవత్సరంలో జిల్లా యంత్రాంగం తరపున జిల్లాలోని సుమారు 2700 మంది పారిశుధ్య కార్మికులకు బీమా ప్రీమియం చెల్లించామని గుర్తు చేశారు. కార్మికుల నుండి ఒక్క రూపాయి తీసుకోకుండా సుమారు పది లక్షల రూపాయల వరకు బీమా చెల్లి ప్రీమియం చెల్లించిందని అన్నారు. వివిధ కారణాలవల్ల కార్మికులు మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందుతుందని అన్నారు. ఈ ఏడాది కూడా కార్మికులందరికీ బీమా ప్రీమియం జిల్లా యంత్రాంగం ద్వారానే చెల్లించాలని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. హెల్త్ క్యాంపులు నిర్వహించి కార్మికులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించాలని, అందరికీ హెల్త్ కార్డులు అందజేయాలని అన్నారు. గతంలో యూనిసెఫ్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపుల ద్వారా కొందరు పారిశుధ్య కార్మికుల్లో టీబీ వ్యాధిని గుర్తించి చికిత్స అందిస్తున్నామని, న్యూట్రిషన్ కిట్టు తో పాటు ప్రతి నెలా వేయి రూపాయలు అందజేస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా జమ్మికుంట మున్సిపల్ కార్మికులకు రూ.20 లక్షల బీమా ప్రీమియం చెల్లించిన మున్సిపల్ కమిషనర్ ఆయూబ్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు లక్ష్మీ కిరణ్, ప్రఫుల్ దేశాయ్, డిఆర్ఓ వెంకటేశ్వర్లు, డిటిడిఓ పవన్ కుమార్, ఆర్డిఓ మహేశ్వర్, యూనిసెఫ్ కోఆర్డినేటర్ కిషన్ స్వామి, ఎల్డీఎం ఆంజనే యులు పాల్గొన్నారు.



## సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కాలేరు

**అంబర్ పేట, ఏప్రిల్ 7, సమయం న్యూస్:** అంబర్ పేట నియోజకవర్గం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో ఈ రోజు ఎమ్మెల్యే శ్రీ కాలేరు వెంకటేష్ గారు 35 మంది లబ్ధిదారులకు దాదాపూ 12 లక్షల 75 వేల రూపా యలు సీఎం ఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందచేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రతీ ఒక్కరు సద్వి నియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాగ్ అంబర్ పేట డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు చంద్ర మోహన్, నాయకులు అరుణ్ కుమార్ రెడ్డి, మిర్యాల రవీందర్, సురేష్ గౌడ్, మల్లేశం, రమేష్, లింగం యాదవ్, అహ్మద్, లబ్ధిదార్లు,వారి కుటుంబ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహాత్ముడిని చంపిన గాడ్సే వారసులు బిజెపి నేతలు

* **అంబేద్కర్ దిష్టిబొమ్మను దహనం చేసిన దుష్టులు ఆర్ఎస్ఎస్ శ్రేణులు**
* **డిసిసి అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి**

గజ్వేల్, మార్చి 7 : జాతిపితగా దేశం మొత్తం కొలిచే మహాత్మా గాంధీని చంపిన గాడ్సే వారసులు బిజెపి నేతలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి ఆరోపించారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ లో భాగంగా సోమవారం వర్గల్ లో పాదయాత్ర చేపట్టి ప్రజలను చైతన్యం చేసిన సందర్భంగా రాష్ట్ర రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగారిగారి ప్రీతంతో కలిసి ఆయన ప్రసంగించారు. భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని అప హస్యం చేస్తున్న మోడీ అధికారం కోసం ఎంతకైనా తెగిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ ప్రజల సొమ్మును కార్పొరేట్ గద్దెలకు కట్టబెడుతున్నట్లు ఎద్దేవా చేశారు. ముఖ్యంగా ఆరెస్సెస్ పత్రిక ఆర్గనైజర్ లో రాజ్యాంగంపై అవమానకర రీతిలో ప్రచురించడం సిగ్గుచేటన్నారు. అయితే ఆర్గనైజర్ పత్రికలో రాజ్యాంగం "భారతీయం కాదు" అని ప్రచురించడం దురదృష్టకరం కాగా, దేశం గర్వించదగ్గ మేధావులు పూజ్య మహాత్మా గాంధీ, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వారసత్వంపై ప్రతినిత్యం బీజేపీ దాడి చేస్తోందన్నారు. అలాగే కరెన్సీ నోట్లపై "గాంధీ" చిత్రాన్నితొలగించేందుకు కూడా బిజెపి వెనుకాడదని, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ను అవమానించడం మోడీకి ఆనవాయితీగా మారిందని చెప్పారు. మహిళల హక్కులపై అంబేద్కర్ మాట్లా



డగా, ఆయన దిష్టిబొమ్మ దగ్దం చేసిన ఘన చరిత్ర ఆరెస్సెస్ దని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో బీజేపీ నేతలు ఎక్కడ దాక్కున్నారని విమర్శించారు. కార్పొరేట్ వ్యవస్థకు కొమ్ముకాస్తున్న బిజెపి సర్కార్ నిరుద్యోగ సమస్యను సైతం పరిష్కరించలేక పోయిందన్నారు . ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ వైస్ చైర్మన్ ఆంక్షా రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సందీప్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి ప్రభుదాస్ గౌడ్, మాజీ ఎంపీపీ మోహన్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు సాయి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## స్విమ్మింగ్ పుల్ ను పరిశీలించిన కార్పొరేటర్

అంబర్ పేట, ఏప్రిల్ 7, సమయం న్యూస్: అంబర్ పేట్ డివిజన్ ఎంసిహెచ్ గ్రౌండ్ లో గల స్విమ్మింగ్ పూల్ ని అంబర్ పెట్ కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఇటీవల స్విమ్మింగ్ పూల్ ని పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని కోరడంతో, స్పందించిన అధికారులు స్విమ్మింగ్ పూల్ ని అందుబాటులోకి తీసుకూరవడం చాలా హర్షనీయమని,అంబర్ పెట్ ప్రజలు అందుబాటులోకి వచ్చిన ఈత కొలనును ఉపయోగించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పల్లె రాజు,షకీల్,సురేష్, ప్రశాంత్, కృష్ణ మరియు సంతోష్ చారి తదితరులు పాల్గొన్నారు

# వ్యక్తిగత పరిశుభ్రత తోనే సంపూర్ణ ఆరోగ్యం

- **గజ్వేల్ ప్రభుత్వ జిల్లా దావకాన సూపర్డెంట్ డాక్టర్ అన్నపూర్ణ**

గజ్వేల్, మార్చి 7 : ,ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని గజ్వేల్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ అన్నపూర్ణ అన్నారు. సోమవారం గజ్వేల్ ప్రభుత్వ జిల్లా హాస్పిటల్ లో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ మన దగ్గర ఎన్ని కోట్లు డబ్బులు ఉన్నా మంచి ఆరోగ్యం లేకుంటే వృధా అని ఆరోగ్యమే మహాభాగ్యము అన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. వరల్డ్




హెల్త్ ఆర్గనైజేషన్ 2025 థీమ్ ప్రకారం ఒక మంచి ఆరోగ్యకరమైన జీవితంతో ప్రారంభమై భవిష్యత్తు ఆశాజనకంగా ఉండాలన్నారు. మానవుడు శారీరకంగా, సాంఘికంగా , సామాజికంగా , మానసికంగా, ఆధ్యాత్మికంగా, ఆరోగ్యంగా, ఉండాలని నిజ జీవితంలో దినచర్య క్రియాశీలకమైందన్నారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని, కలుషితమైన ఆహారం, కలుషితమైన నీరు, కలుషితమైన గాలి, ఆరోగ్యానికి ముప్పుఅని పిలుపునిచ్చారు. హాస్పిటల్ లో తాము ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని ,ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండడమే తమ లక్ష్యం అన్నారు. నర్సింగ్ సూపరింటెండెంట్ స్వరూప రాణి గారు మాట్లాడుతూ ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలలో చైతన్యం తేవాలని వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆరోగ్యాన్ని తన చేతిలో ఉంచుకోవాలని, వైరల్ ఇన్ఫెక్షన్లు బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్లు లేకుండా చూసుకోవాలన్నారు. ఏమైనా అనారోగ్య పరిస్థితులు ఉంటే దగ్గరలో ఉన్న ఆశ వర్కర్ ను ఏఎన్ఎం సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఎం ఓ డాక్టర్ రాము, డ్యూటీ డాక్టర్ నవ్య రావు డాక్టర్ తర్జని, హెడ్ నర్సులు విజయలక్ష్మి , ఫార్మసిస్టులు నర్సింలు, శ్రీనివాసచారి, హెల్త్ అసిస్టెంట్స్ దేవసాని వాసుదేవ్, నాగరాజు పాల్గొన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటిద్దామని, ఆరోగ్య సమాజానికి పునాదులు వేద్దాం అంటూ అని నినాదాలు చేస్తూ హాస్పిటల్ సిబ్బంది ప్రజలకు, రోగులకు అవగాహన కల్పించారు.




## వెల్దుర్తి మండల కేంద్రంలోని ఘనంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలు

వెల్దుర్తి ఏప్రిల్ 7, సమయం న్యూస్ : వెల్దుర్తి మండల కేంద్రంలో సోమవారం నాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలు వెల్దుర్తి లోని బాలాజీ గార్డెన్స్ లో విద్యార్థిని విద్యార్థుల మధ్య ఘనంగా జరుపుకున్నారు. జిల్లా గ్రంథాలయ శాఖ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి నర్సాపూర్ కాంగ్రెస్ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి హాజరయ్యారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేసి వచ్చిన ముఖ్య అతిథులను ఉత్సాహపరిచారు. అంతే కాకుండా ప్రైవేటు విద్యా సంస్థలకు పోటీగా ఆటపాటల్లోనూ మరియు చదువులోనూ, అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు కూడా దేనికి తీసిపోకుండా పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులను తయారు చేస్తున్నారు. అని హెచ్ ఓ డి సాంబయ్య ఉపాధ్యాయులను కొనియాడారు. హెచ్వోడి సాంబయ్య మాట్లాడుతూ స్కావెంజర్ జీతభత్యాలు గానీ, పిల్లలకు అల్పారాలను కానీ, అంతే కాకుండా ల్యాబ్ లో అందించిన పరికరాల గురించి గానీ, ఇవన్నీ ఎంతో సంతృప్తినిచ్చాయని ప్రభుత్వాని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పూర్వ విద్యార్థి అయిన నల్లచెరువు రమేష్ గౌడ్ ప్రతి సంవత్సరం లాగానే ఈ



సంవత్సరం కూడా పదవ తరగతిలో ప్రథమ, ద్వితీయ,తృతీయ, ర్యాంకులు వచ్చిన వారికి 51 వెయ్యిలు నగదు బహుమానం ఇస్తానని సభాముఖంగా తెలపడం జరిగింది. అంతేకాకుండా ఈ సంవత్సర కాలంలో పాఠశాలలో జరిగిన అన్ని కార్యక్రమాల ఫోటోగ్రఫీని కూడా ఏర్పాటుచేసి ముఖ్య అతిథులకు చూపించారు. అలాగే జిల్లా నాయకుడు నరేందర్ రెడ్డి పాఠశాలకు ఎదో రకమైన సాయాన్ని కూడా అందిస్తున్నారని హెచ్వోడి సాంబయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి అరికెల యాదగిరి, కుక్కునూరు పాఠశాల హెచ్ఎం సీతారాం, జిల్లా నాయకుడు నరేందర్ రెడ్డి, మెదక్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కృష్ణ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్ గౌడ్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మహేష్ రెడ్డి, వెల్దుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం, పాఠశాల విద్యార్థిని విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు కూడా పాల్గొన్నారు.

# తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ నూతన అధ్యక్షుడికి ఘన సన్మానం

కరీంనగర్, ఏప్రిల్ 7, సమయం న్యూస్ : కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ నూతన అధ్యక్షుడిగా నియామకమైన బండారి రమేష్ ను ఎల్ఎండి కాలనీలో సోమవారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ సీనియర్ నేత అబ్దుల్ సమద్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సమద్ మాట్లాడుతూ మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియామకమైన బండారి రమేష్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రమేష్ ఆధ్వర్యంలో మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తామని, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో ముందుకెళ్తామని పేర్కొన్నారు. యువతను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రమేష్ అధ్యక్షుడుగా నియమించడం శుభ పరిణామమని, రాబోయే రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించేలా ఇప్పటినుంచి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్ఠం చేస్తామని సమద్ పేర్కొన్నారు. బండారి రమేష్ ను మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నియమించిన డిసిసి అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ మండల కాంగ్రెస్ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ



కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధగోని లక్ష్మీనారాయణ గౌడ్, కాంగ్రెస్ నాయకులు ఎల్లారెడ్డి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు

# నవోదయ ప్రవేశ పరీక్షలో
# వికసించిన ఇందూరు కుసుమాలు, సన్మానించిన ఎమ్మెల్యే





**బోధన్, 7 ఏప్రిల్, సమయం న్యూస్ :** నిజామాబాద్ జిల్లా జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షలో సుమారు 1500 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 9వ తరగతికి కేవలం 17 సీట్లు ఉన్నప్పటికీ, ఇందూర్ హై స్కూల్ నుంచి 5 విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎంపిక కావడం జరిగింది. ఈ విజయాన్ని గౌరవిస్తూ ట్రస్మా జిల్లా అధ్యక్షులు, పాఠశాల కరస్పాండెంట్ కొడాలి కిషోర్, ఎంపికైన విద్యార్థులు మాజీ మంత్రి బోధన్ నియోజకవర్గ శాసనసభ్యులు ప్రొద్దుటూరీ సుదర్శన్ రెడ్డిని నిజామాబాద్ కలెక్టరేట్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పూలగుచ్ఛాన్నీ అందించడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులు కొడాలి కిషోర్, బోధన్ శాసనసభ్యులు పొద్దుటూరీ సుదర్శన్ రెడ్డి చే నవోదయ పోటీ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎంపికైన ఐదుగురు విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, "ప్రతిష్టాత్మకమైన నవోదయ పాఠశాలలో ఐదుగురు విద్యార్థులు ఎంపిక కావడం గర్వకారణమనీ, మీరు ఉన్నత విద్యలో మరింత రాణించి బోధన్‌కు, మీ తల్లిదండ్రులకు, గురువులకు, పాఠశాలకు గౌరవాన్ని తెచ్చేలా కృషి చేయాలి" అని తెలిపారు. ట్రస్మా జిల్లా అధ్యక్షులు, ఇందూర్ హై స్కూల్ కరస్పాండెంట్ కొడాలి కిషోర్ మాట్లాడుతూ మా విద్యార్థులు J.వంశిక, Y.ఆరూషి, రిశ్విత, అస్మిత, సాత్విక్ లు ఉత్తమ ప్రథమ కనపర్చినందుకు అభినందనలు తెలుపుతూ, విద్యార్థులు ఇంతలా రాణించడానికి కృషి చేస్తున్న మా ఉపాధ్యాయ బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు, "మేము విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తూ బోధన్ పట్టణానికి మరింత పేరు తేవడానికి కృషి చేస్తాం" విద్యార్థుల తల్లిదండ్రులు మమ్మల్ని ఇంతలా ఆదరిస్తున్నందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి తో పాటు ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నాగేశ్వరరావు, పులి శ్రీను పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.




# 1 1 0 మంది దంపతులతో కమనీయంగా సీతారాముల కళ్యాణం

రాయపోల్ ఎప్రిల్ 07.సమయం న్యూస్ : రాయపోల్ మండల కేంద్రం లోని హనుమాన్ దేవాలయ ఆవరణలో శ్రీరామనవమి సందర్భంగా శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని ఆదివారం రాత్రి పురోహితులు. భక్తుల జయ జయ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. రాత్రి 8 గంటలకు స్వామివారి ఎదుర్కొల్లు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పెళ్లి పందిరిలో సీతారాముల కళ్యాణం ఎంతో వైభవంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం శ్రీరామనవమి సందర్భంగా ఇక్కడ 110మంది దంపతులతోకళ్యాణం నిర్వహించడం ఆనవాయితీగా గత 20 సంవత్సరాల నుంచి కొనసాగుతూ వస్తుంది. రాయపోల్ మండల కేంద్ర ప్రజలతోపాటు పరిసర గ్రామాల ప్రజలు. హైదరాబాదులో నివాసం ఉండే వాసులు ఆదివారం సాయంత్రానికి గ్రామానికి చేరుకొని కళ్యాణ మహోత్సవంలో పాల్గొని స్వామివారి కళ్యాణం తిలకించారు. గడ్డి భాస్కర్ రెడ్డి దంపతులు కళ్యాణ నిర్వహించగా. మరో 110 మంది కళ్యాణ మహోత్సవంలో దంపతులు పాల్గొన్నారు. అంతకుముందు ఉదయం నుంచి రాత్రి వరకు గ్రామస్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గతంలో ఎప్పుడు లేని విధంగా ఈ సంవత్సరం కొత్తగా స్వామివారికి విమాన రథోత్సవాన్ని దాతల సహకారంతో ఏర్పాటు చేశారు. గ్రామ ప్రజలు. యువకులు. కళ్యాణ మహోత్సవంలో ఉత్సాహంతో పాల్గొన్నారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో పురోహితులు వెంకటేశ్వర శర్మ. జంగం మాణిక్య ప్రభు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

*** కన్నుల పండుగ రథోత్సవం...**

మండల కేంద్రంలో ఆదివారం రాత్రి హనుమాన్ ఆలయ ఆవరణలో 110 మంది జంటలతో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. సోమవారం సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం గ్రామస్తులు భక్తులు రథని లాగారు. భక్తులు మహిళలు మంగళ హారతులతో స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు.



## డంపింగ్ యార్డ్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ కొనసాగుతున్న నిరసనలు

గుమ్మాడిదల, ఏప్రిల్ 7, (సమయం న్యూస్) : గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి గ్రామపంచా యతీ పరిధిలోని ప్యారానగర్ గ్రామంలో ఏర్పాటు చేయనున్న డంప్ యార్డును వ్యతిరేకిస్తూ చేపట్టిన నిరసన కార్యక్రమాలు సోమవారంతో 62వ రోజుకు చేరుకున్నాయి. దీక్షకు మద్దతుగా భారతీయ జనతా పార్టీ గుమ్మడిదల మండల అధ్యక్షుడు కావలి ఐలేష్ ఆధ్వర్యంలో నిరసన చేపడుతున్న వారికి సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లా డుతూ డంప్ యార్డ్ ఏర్పాటుతో ఇక్కడి ప్రాంత ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని తెలిపారు. డంప్ యార్డ్ ఏర్పాటును ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ పార్టీ ఆధ్వ ర్యంలో తాము కూడా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నల్లవల్లి గ్రామ బూత్ అధ్యక్షులు శేఖర్, నాయకులు మధు ముత్యాలు గౌడ్, రాజు, రాజశేఖర్ , సత్యనారాయణ బిక్షపతి గౌడ్, గ్రామస్తులు, మహిళలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# ప్రభుత్వ హాస్పిటల్లో మెరుగైన వైద్య చికిత్సలను అందించండి

*** జిల్లా కలెక్టర్ అభిలాష్ అభినవ్**

నిర్మల్ ఏప్రిల్ 07 (సమయం న్యూస్) : ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్య చికిత్సలను అందించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ వైద్యాధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ మాత, శిశు సంరక్షణ ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ఎస్ఎన్ సియు, పోస్ట్ ఆపరేషన్, ఇంజక్షన్ వార్డులను పరిశీలించి రిజిస్టర్ లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రికి వచ్చే గర్భిణీలు, బాలింతలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన వైద్య చికిత్సలు, సౌకర్యాలు కల్పించాలని



ఆదేశించారు. సాధారణ ప్రసవాలను సంఖ్యను పెంచాలని, ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం కలిగేలా మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని, విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి, నిరంతరం పరిశుభ్రతను పాటించాలన్నారు. పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, అవుట్ పోస్ట్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, సౌకర్యాలపై రోగులను కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో ఆసుపత్రి వైద్యులు డా. సరోజ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా శ్రీరామచంద్రుని పట్టాభిషేక మహోత్సవం

బోధన్, 7 ఏప్రిల్ సమయం న్యూస్ : బోధన్ పట్టణంలోని శక్కర్ నగర్ లో గల శ్రీ రామ మందిరంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో శ్రీరామ చంద్రుని పట్టాభిషేక మహోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ పవిత్ర కార్యక్రమాన్ని శ్రీ రామ మందిరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అద్భుతంగా నిర్వహించబడింది. హైదరాబాద్ బాగ్ అంబర్ పేట్ వాసులు పుచ్చకాయల మాధవి లత ప్రకాష్ దంపతులు పాల్గొన్నారు.కార్యక్రమంలో అర్చకులు ప్రవీణ్ మహారాజ్, ఆలయ అర్చకుల వేద మంత్రోచ్చారణ మధ్య శ్రీ సీతారామచంద్రుల స్వామి వారి పట్టాభిషేకం ఘనంగా నిర్వహించబడింది. శ్రీరామచంద్రుని పట్టాభిషేక కార్యక్రమాన్ని తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి, కనులారా వీక్షించి స్వామివారి దర్శించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. విశేషంగా హనుమాన్ దీక్షపరులచే, భక్తులచే రామనామ స్మరణచే ఆలయ ప్రాంగణం అంతా వినిపించడంతో భక్తుల మనసును రంజింప చేసింది. అనంతరం ఆలయ కమిటీ తరపున ఆలయానికి విచ్చేసిన భక్తుల కొరకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ మహోత్సవానికి ఆలయ కమిటీ నిర్వాహకులు వెంకటేశ్వర శర్మ, లక్ష్మణ్ గుప్తా, శంకర్, రామరాజు, ఎమ్ రామచందర్ గణేష్, విష్ణువర్ధన్ రెడ్డి, గజానంద్, శ్యామ్, హనుమాన్ దీక్షాపరులు తదితరులు హాజరై కార్యక్రమాన్ని వైభవంతంగా జరిపారు.




స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించిన గౌరవ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించిన రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేతల శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు గారు, దేవాదాయశాఖ కమిషనర్ శ్రీ శ్రీధర్ గారు




## ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

గుమ్మడిదల ఏప్రిల్ 7 (సమయం న్యూస్): సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండల కేంద్రంతోపాటు మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని ప్రతి గ్రామంలో పాఠశాలల్లోని విద్యార్థులతో ఆశా వర్కర్లు కలిసి ర్యాలీలు, సమావేశాలు నిర్వహించి ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. గర్భిణీ స్త్రీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల ప్రాముఖ్యత గురించి. అనేక రకాల సంక్రమిక వ్యాధులపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఎస్ మధుకర్. ఎం పి హెచ్ ఈ ఓ శ్రీనివాస్, ఏఎన్ఎంలు శ్రీలక్ష్మి,, శశికళ, వసంత, వనాకుమారి ,స్వరూపలు మరియు వివిధ గ్రామాల ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



భద్రాచలం ఐటిడిఏ ప్రాంగణంలో గిరిజన మ్యూజియం ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు,ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, జిల్లా కలెక్టర్ జతీష్ వి పాటిల్ మరియు ఎస్పీ రోహిత్ రాజ్.

## గుమ్మడిదల మండల తహసీల్దార్ గా పరమేశం

**గుమ్మాడిదల ఏప్రిల్ 7 (సమయం న్యూస్):** సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం తహసీల్దార్ గా పరమేశం బాధ్యతలు స్వీకరించారు. మండల కార్యాలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు.





## కలెక్టరేట్ లో ఉచిత అంబలి పంపిణీని ప్రారంభించిన కలెక్టర్

నిజామాబాద్, ఏప్రిల్ 07: (సమయం న్యూస్) తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం (టీఎన్జీఓ) జిల్లా శాఖ ఆధ్వర్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో నెలకొల్పిన ఉచిత అంబలి పంపిణీ కేంద్రాన్ని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సోమవారం లాంచనంగా ప్రారంభించారు. చల్లని తాగునీటితో పాటు ఉచితంగా అంబలి పంపిణీకి చొరవ చూపడం అభినందనీయమని టీఎన్జీఓ సంఘాన్ని అభినందించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, సామాజిక సేవా కార్యక్రమాలు చేప ట్టడం గొప్ప విషయం అని అన్నారు. కలెక్టరేట్ ఉద్యోగులతో పాటు వివిధ పనుల కోసం సమీకృత జిల్లా కార్యా లయ సముదాయానికి వచ్చే వారికి ప్రస్తుత వేసవిలో అంబలి కేంద్రం ఎంతో ఉపశమనాన్ని అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓల సంఘం జిల్లా అధ్యక్షుడు సుమన్, కార్యదర్శి శేఖర్, రాష్ట్ర నాయకుడు గైని గంగారాం తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ పేపర్ వాల్యూవేషన్ సెంటర్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



మెదక్ ఏప్రిల్ 07 (సమయం న్యూస్) : సోమవారం మెదక్ జిల్లా కేంద్రంలో బాలుర జూనియర్ కళా శాల లో ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించిన జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియను జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పర్యవేక్షించారు. వాల్యూషన్ సెంటర్లో మౌలిక వసతులు గురించి సెంటర్ ఇంచార్జ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మెదక్ జిల్లా కేంద్రాల్లో బాలుర జూనియర్ కాలేజ్ నందు మార్చి 06 నుండి ప్రారంభమై 07 ఏప్రిల్, 2025 ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించిన జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియ ముగిసింది అన్నారు. ఈ సెంటర్లో రీకౌంటింగ్ రీవాల్యుయేషన్ ప్రక్రియ నడుస్తుందని తెలిపారు. సుమారు 690 మంది అధ్యాపకులు మూల్యాంకన ప్రక్రియలో పాల్గొని దాదాపు 01 లక్ష 87 వేల జవాబు పత్రాలు మూల్యాంకనం చేశారని ఒక్కో అధ్యాపకుడు రోజుకు 30 జవాబు పత్రాలను మూల్యాంకనం చేశారని వివరించారు. ఈరోజు ఆర్థిక శాస్త్రం సంబంధించిన సబ్జెక్టుతో వాల్యుయేషన్ ప్రక్రియ ముగిసిందని రీకౌంటింగ్ రీవాల్యుయేషన్ ప్రక్రియ నడుస్తుందన్నారు. త్వరలో ఫలితాలను విడుదల చేసేందుకు బోర్డు సన్నాహాలు చేస్తోంది. అని వివరించారు. మెదక్ జిల్లాలో ఇంటర్మీడియట్ పేపర్ వాల్యుయేషన్ సెంటర్ తీసుకురావ డానికి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ చేసిన కృషి మరువలేనిది. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి మాధవి, కోడింగ్ ఆఫీసర్ శేషాచారి, అసిస్టెంట్ కోడింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు

## సమస్యల పరిష్కారానికి సరికొత్త కార్యక్రమం.. తెలంగాణలోనే చారిత్రాత్మకం..

# 'మానకొండూర్ లో ఎమ్మెల్యే ఆన్ వీల్స్..'

- **25 లక్షలతో ప్రత్యేక వాహనం ఏర్పాటు..**
- **యాప్ లో సమస్య నమోదు చేస్తే చాలు..**
- **వారంలో మూడు రోజులు ఎమ్మెల్యేతోపాటు అధికారుల పర్యటన..**
- **ఈనెల 14న అంబేద్కర్ జయంతి రోజున శ్రీకారం..**






కరీంనగర్, ఏప్రిల్ 7 (సమయం న్యూస్) : మామూలుగా అయితే గ్రామాల్లో ఏదైనా సమస్య ఉందంటే ప్రజలు మండల అధికారులు, ఎమ్మెల్యేకు విన్నవిస్తుంటా రు. ఆ సమస్య పరిష్కారం అయ్యేవరకు గ్రామీణ ప్రాంతం నుంచి మండల కేంద్రం వరకు జిల్లా కేంద్రం వరకు తిరిగి తిరిగి విసుకు చెందుతూనే ఉంటారు. ఆ సమస్య ఎప్పుడు పరిష్కారం అవుతుందో.. ఎన్నాళ్లకు మోక్షం కలుగుతుందో తెలియని పరిస్థితి.. తీరా అధికారుల వద్దకు వెళ్లి సమస్యను వివరించి వినతి పత్రం అందిస్తే ఆ పత్రాన్ని ఎక్కడ పడేస్తారనే భయం ప్రజలది. దానికి ఎన్ని నెలలకు మోక్షం కలుగుతుందో దీనా వస్థ ప్రజలది. నిత్యం ఎదురవుతున్న సమస్యలు ఇవీ.

కానీ ఈ ఎమ్మెల్యే మాత్రం ప్రజల పక్షాన నిలుస్తూ వారి సమస్యల పరిష్కారానికి చక్కని ఆలోచన చేశారు. అది ఏంటంటే.. సమస్య ఎక్కడ ఉంటే అక్కడికే ఎమ్మెల్యే వస్తారు.. ప్రజల మధ్యనే పరిష్కరిస్తారు.. జిల్లా స్థాయి రాష్ట్రస్థాయి సమస్యలైతే జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి అధికారులతో మాట్లాడుతారు.. ఆ సమస్యకు పరిష్కా రం ఎన్ని రోజుల్లో అవుతుందో హామీ తీసుకుంటారు.. దాన్ని ఫాలోఅప్ చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారు. ఆ సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు ప్రజల వెంట నిలుస్తారు. సమస్యల పరిష్కారం కోసం వినూత్నమైన కార్యక్రమాన్ని అమలు చేయబోతున్నారు. ఇందుకోసం కరీంనగర్ జిల్లా మానకొండూ ర్ ఎమ్మెల్యే అండ్ వీల్స్ పేరిట ఎమ్మెల్యే సొంతంగా 25 లక్షల రూపాయలతో ప్రత్యేక వాహనాన్ని తయారు చేయించారు. ఈనెల 14వ తేదీన అంబేద్కర్ జయంతి రోజున ఈ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారు. మానకొండూరు నియోజకవర్గం లో వారంలో మూడు రోజుల పాటు గ్రామాల్లోని ఎమ్మెల్యే పర్యటించను న్నారు. ఆ ప్రత్యేక వాహనంలో అధికారులను వెంటబెట్టుకొని గ్రామాల్లో సమస్యలను పరిష్కరించను న్నారు. ఇంతకీ ఆ ఎమ్మెల్యే పేరు చెప్పడం మర్చిపోయాం కదా.. ఆయనే మన కరీంనగర్ జిల్లా మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ.. వృత్తిరీత్యా డాక్టర్ అయినా ప్రజా సేవలో అలుపెరగకుండా నిమగ్నమవుతున్నారు. ఒకవైపు నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపడుతూనే నిత్యం ప్రజలకు కష్టసుఖాల్లో చేదోడు వాదోడుగా నిలుస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే ఎవరు చేపట్టని విధంగా ఎమ్మెల్యే కొత్త కాన్సెప్టో ప్రజల ముందుకు వస్తుండడంతో ఈ కార్యక్రమం చారిత్రాత్మకంగా నిలుస్తుంది.

ఎమ్మెల్యే అండ్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా సమస్యల పరిష్కారానికి ఒక ప్రత్యేకమైన యాప్ ను రూపొందించారు. గూగుల్ ప్లే స్టోర్ లో ఎమ్మెల్యే ఆన్ వీల్స్ అని టైప్ చేసి యాప్ డౌన్లోడ్ చేసుకోవాలి. తర్వాత యాప్ లో గ్రామాల్లోని సమస్యలు వ్యక్తిగత సమస్యలు అందులో నమోదు చేసుకోవాలి. ఈ మేరకు వివరాలు నమోదు చేసుకునేందు కు అవకాశం కల్పించారు. యాప్ లో నెంబర్ చేసిన సమస్యలను ఎమ్మెల్యే వీల్స్ కార్యక్రమంలో భాగంగా గ్రామానికి వచ్చినప్పుడు ఆ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు.

### ఎమ్మెల్యే రాజకీయ ప్రస్థానం..

కవ్వంపల్లి సత్యనారాయణ కరీంనగర్ లో 1963లో జన్మించారు. ఆయన కాకతీయ మెడికల్ కళాశాల నుంచి ఎంబీబీఎస్, ఎమ్మెస్ పూర్తి చేసి వైద్యుడిగా తన జీవితాన్ని మొదలుపెట్టారు. తన వృత్తిలో భాగంగా అనేక గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించి ప్రజలకు వైద్య సేవలందించారు. అనేక సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టారు. మానకొండూర్ మండలం పచ్చునూర్ చెందిన ఆయన 2008లో రాజకీయరంగ ప్రవేశం చేశారు. అప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ రాజశేఖర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్లో చేరారు. 2009 లో తెలుగుదేశం పార్టీ మంచి పోటీ చేసి కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ జడ్పీటీసీ గా పోటీ చేసి విజయం సాధించారు. మొదటి సారి 2009లో మానకొండూర్ నుంచి ప్రజారాజ్యం పార్టీ తరఫున పోటీ చేసి ఓడిపోయారు. తర్వాత టీడీపీ నుంచి 2014లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి చెందారు. 2023 లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి రసమయి బాలకిషన్పై 32 వేలకు పైచిలుకు మెజార్టీతో గెలిచారు. కవ్వంపల్లి సత్యనారాయణ, డాక్టర్ అనురాధ దంపతులకు కూతురు, కొడుకు ఉన్నారు. కాంగ్రెస్లో కవ్వంపల్లి తనదైన ముద్ర చాటుకుంటూ అంచలంచెలుగా ఎదుగుతూ వస్తున్నారు. మానకొండూరు లో 2009లో తొలిసారి ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి మూడోస్థానంలో నిలిచారు. 2014లో తెదేపా తరఫున 23,570 ఓట్లు సాధించి మూడోస్థానంతో సరిపెట్టుకున్నారు. 2018లో టికెట్ దక్కలేదు. 2023లో కాంగ్రెస్ టికెట్తో పోటీకి దిగి బీఆర్ఎస్ అభ్యర్థి రసమయి బాలకిషన్పై విజయం సాధించారు. ఆయన కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా ప్రస్తుతం పని చేస్తున్నారు. ఎమ్మెల్యేగా గెలుపొందడం తో డాక్టర్ కవ్వంపల్లి కల నెరవేరింది. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం పాటుపడు తున్నారు.

### వినూత్నం.. 'ఎమ్మెల్యే ఆన్ వీల్స్' ..

కరీంనగర్ జిల్లా మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రజాపాలన ప్రభుత్వంలో ప్రజా సమస్యల పరిష్కారానికి 'ఎమ్మెల్యే ఆన్ వీల్స్' అనే పేరుతో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారు. మానకొండూర్ నియోజకవర్గంలోని ప్రజలు ఎదుర్కొంటు న్న సమస్యల పరిష్కారానికి వారంలో మూడు రోజుల పాటు ప్రజల మధ్యే ఉండి వారి సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకునేలా ప్రణాళిక రూపొందించారు. ఈ మేరకు 'ఎమ్మెల్యే ఆన్ వీల్స్' కార్యక్రమాన్ని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి రోజున ఏప్రిల్ 14వ తేదీన ప్రారంభించనున్నారు. అంబేద్కర్ జయంతికి ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. అంబేద్కర్ సామాజిక న్యాయం, సమానత్వం కోసం చేసిన కృషిని గుర్తు చేస్తుంది. డా. అంబేద్కర్




భారత రాజ్యాంగాన్ని రూపొందించడమే కాకుండా, అణగారిన వర్గాల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేశారు. ఇందుకోసమే ఈ రోజును ఎమ్మెల్యే ఆన్ వీల్స్ కార్యక్రమం ప్రారంభానికి ఎంచుకున్నారు. వారంలో మూడు రోజులు నియోజకవర్గంలోని (తిమ్మాపూర్, మానకొండూర్, శంకరపట్నం, ఇల్లంతకుంట, బెజ్జంకి, గన్నేరువరం) మండలాల్లోని మూడు గ్రామాలను ఎంపిక చేసుకొని ఎమ్మెల్యేతో పాటు మండల స్థాయి అధికారులు కలిసి ఆ వాహనంలో వెళ్తారు. ఆయా గ్రామాల్లో ని ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను పరిశీలిం చి పరిష్కారమయ్యే సమస్యలను అక్కడికక్కడే సత్వరమే పరిష్కరిస్తారు. డివిజన్, జిల్లా, రాష్ట్ర సమస్యలైతే ఆయా స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తారు. సమస్య పరిష్కారానికి అవసరమైన మార్గాలను అన్వేషించి పరిష్కారం అయ్యేవరకు ఫాలో అప్ చేస్తారు. మిగిలిన నాలుగు రోజులు గ్రామాల్లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి మార్గాలను అన్వేషిస్తారు..

### రూ. 25 లక్షలతో ప్రత్యేక వాహనం కొనుగోలు..

'ఎమ్మెల్యే ఆన్ వీల్స్' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు ఎమ్మెల్యే కవ్వంపల్లి రూ. 25లక్షలతో ప్రత్యేకంగా వాహనం కొనుగోలు చేశారు. ఆధునాతన సదుపాయాలతో రూపొందిం చారు. వాహనంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రెవెన్యూ, పోలీస్, ఇతర శాఖల అధికారులకు అవసరమైన కంప్యూటర్ ఇతర సామగ్రి ఇందులో ఉంటాయి. ఈ వాహనంలోనే కొన్ని ముఖ్యమైన పరిపాలనా కార్యకలా పాలను నిర్వహించుకునే అవకాశం ఉంది. మండల స్థాయి అధికారులకు కావాల్సిన కంప్యూటర్, ప్రింటర్తోపాటు ఇతర సామగ్రి, ఫర్నిచర్ అందుబాటులో ఉంచారు. గ్రామానికి వెళ్లిన తర్వాత దరఖాస్తులు స్వీకరించి వాటిని ఆన్లైన్ చేయడానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ వాహనం ఆధునాతనమైన టెక్నాలజీకి అనుగుణంగా తయారు చేయించారు. ఇంతవరకు దేశంలో ఇలాంటి కార్యక్రమాన్ని టెక్నాలజీ, అధికారులు, ప్రజల విశ్వాసంతో అమలు చేసిన చరిత్ర ఎక్కడా లేదు. కవ్వంపల్లి ఇందులో రికార్డు సృష్టించబోతున్నారు.

### ప్రత్యేక యాప్ రూపకల్పన..

'ఎమ్మెల్యే ఆన్ వీల్స్' కార్యక్రమం కోసం ప్రత్యేక యాప్ తయారు చేయించారు. గూగుల్ ప్లేస్టోర్కు వెళ్లి 'ఎమ్మెల్యే ఆన్ వీల్స్' అని టైప్ చేసి యాప్ డౌన్లోడ్ చేసుకోవాలి. యాప్లో గ్రామాల్లోని సమస్యలు లేదా వ్యక్తిగత సమస్యలు అందులో నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. యాప్లో నమోదైన ప్రతీ సమస్యను ఎమ్మెల్యే ఆన్ వీల్స్ కార్యక్రమంలో గ్రామాలకు వచ్చినప్పుడు పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు. యాప్ లో నమోదైన ప్రతీ సమస్య ఫిర్యాదు ట్రాకింగ్ సిస్టం ఏర్పాటు చేశారు. ఫిర్యాదు ఏ దశలో ఉందో ఎప్పటికప్పుడు సమాచారం తెలుస్తుంది. ఒక వేళ పరిష్కారమైతే అయిందని చూపిస్తుంది. తెలంగాణలో తొలిసారిగా మానకొండూర్ ఎమ్మెల్యే చేపట్టిన 'ఎమ్మెల్యే ఆన్ వీల్స్' కార్యక్రమం విజయవంతం అయితే తెలంగాణలోని మిగిలిన ఎమ్మెల్యేలకు ఆదర్శంగా నిలుస్తుంది. దీంతోపాటు ఆ పద్ధతిని వారు అనుసరించడం తప్పదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

### కార్యాచరణ ఇది..

ప్రతి గ్రామానికి ఎమ్మెల్యే స్వయంగా అధికారులతో కలిసి వెళ్లి ప్రజల ఫిర్యాదులను స్వీకరిస్తారు. వెంటనే పరిష్కరించదగిన సమస్యలను అక్కడికక్కడే తీరుస్తారు. జిల్లా యంత్రాంగం లేదా సెక్రటేరియట్ స్థాయిలో చర్చించాల్సిన సమస్యలను యాప్లో నమోదు చేసి, ప్రభుత్వ అధికారుల సమన్వయంతో పరిష్కారం చూపిస్తారు. ఈ ఫిర్యాదుల పరిష్కార స్థితిని, ఎమ్మెల్యే తిరిగి గ్రామాన్ని సందర్శించే సమయంలో నోటిఫికేషన్ ద్వారా ప్రజలకు తెలియజేస్తారు. ఇది పేద ప్రజలకు ఎంతో మేలు చేస్తుంది. ఒక్క సమస్య కోసం దఫదఫాలుగా వివిధ కార్యాలయాలను తిరగాల్సిన అవసరం లేకుండా, అధికారులు గ్రామానికే వచ్చి సమస్యలను పరిష్కరించనున్నారు. ప్రజలకు ఈ కార్యక్రమం ఎంతో మేలు చేస్తుంది.

### తెలంగాణలోనే గేమ్ ఛేంజర్!

ఎమ్మెల్యే ఆన్ వీల్స్ కార్యక్రమం తెలంగాణ రాజకీయాల్లోనే ఒక గేమ్ ఛేంజర్గా నిలువనుంది. పాలనా విధానంలో విప్లవాత్మకమైన, గణనీయమైన మార్పును తీసుకురానుంది. ప్రజా సేవలో చారిత్రాత్మకంగా నిలుస్తోంది. ఈ కార్యక్రమం ఎమ్మెల్యే నియోజకవర్గ ప్రజల పట్ల చూపుతున్న నిబద్ధతకు నిదర్శనంగా మారనుంది. ఈ కార్యక్రమం విజయవం తమైతే, తెలంగాణలోనే కాకుండా దేశవ్యాప్తంగా ఇతర ప్రజాప్రతినిధులు ఆదర్శంగా తీసుకునే అవకాశం ఉంది. ఆల్ ది బెస్ట్ ఎమ్మెల్యే కవ్వంపల్లి.. మీ ఆశయం నెరవేరాలి.. ప్రజల ఆకాంక్షలు తీరాలి.. మీరు అనుకున్న లక్ష్యం నెరవేరాలని ఆశిద్దాం..

- **ప్రజా సమస్యల పరిష్కారానికే ఎమ్మెల్యే ఆన్ వీల్స్..**
- **మానకొండూరు ఎమ్మెల్యే వ్వంపల్లి సత్యనారాయణ..**

మానకొండూరు నియోజకవర్గం లో సమస్యల పరిష్కారానికి ఒక చక్కని వేదికను రూపొందించాం. దాని పేరే ఎమ్మెల్యే అని వీల్స్. ఈ కార్యక్రమాన్ని ఈనెల 14వ తేదీన ప్రారంభిస్తున్నాం. ప్రజలంతా ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ఉన్న సమస్యలు పరిష్కరించుకోవాలి. ఎమ్మెల్యే ఆన్ వీల్స్ యాప్ లో సమస్యలు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. వాటి పరిష్కారానికి వారంలో నియోజకవర్గ వ్యాప్తంగా మూడు రోజులు అధికారులతో కలిసి గ్రామాలను సందర్శిస్తా. ఆ సమయంలో పరిష్కరించే వీలున్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తాం. జిల్లా, రాష్ట్ర స్థాయి సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. ఎప్పటికప్పుడు వాటి పరిష్కారానికి ఫాలోఅప్ చేస్తాం. ప్రజా ప్రభుత్వం ప్రజలది. మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతున్నారూ. ముఖ్యమంత్రినీ స్ఫూర్తిగా తీసుకొని ఈ కార్యక్రమానికి శ్రీకారం చుదుతున్నాం. ఎమ్మెల్యే అండ్ వీల్స్ కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలి. సమస్యలన్నీ పరిష్కరించుకోవాలి.

సమయం
APTEL/2006/18267



# తిలక్, హార్దిక్ చెలరేగినా..

# చివర్లో తడబడ్డ ముంబయి.. ఆర్సీబీ విజయం



ముంబయి: ఐపీఎల్ 18లో భాగంగా ముంబయి ఇండియన్స్‌తో జరిగిన ఉత్కంఠ పోరులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు 12 పరుగుల తేడాతో విజయం సాధించింది. మొదట బెంగళూరు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 221 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ముంబయి 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 209 పరుగులకు పరిమితం అయింది. ఆ జట్టులో తిలక్ వర్మ (56; 29 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లు), హార్దిక్ పాండ్య (42; 15 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) చెలరేగినప్పటికీ కీలక సమయంలో ఔట్ కావడంతో ముంబయి చివర్లో తడబడింది. సూర్యకుమార్ యాదవ్ (28; 26 బంతుల్లో 5 ఫోర్లు), విల్ జాక్స్ (22; 18 బంతుల్లో), రోహిత్ శర్మ (17; 9 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్), రికెల్‌టన్ (17) పరుగులు చేశారు. ఆర్సీబీ బౌలర్లలో కృనాల్ పాండ్య 4, యశ్ దయాళ్ 2, జోష్ హేజిల్‌వుడ్ 2, భువనేశ్వర్ కుమార్ ఒక వికెట్ తీశారు.

**దంచికొట్టిన కోహ్లీ, పటీదార్..**

తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 221 పరుగులు చేసింది. విరాట్ కోహ్లీ (67; 42 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లు), రజత్ పటీదార్ (64; 32 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) దంచికొట్టారు. దేవ్‌దత్ పడిక్కల్ (37; 22 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) క్రీజులో ఉన్నంతసేపు మెరుపులు మెరిపించాడు. చివర్లో జితేశ్ శర్మ (40*; 19 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) విరుచుకుపడ్డాడు. ముంబయి బౌలర్లలో హార్దిక్ పాండ్య 2, ట్రెంట్ బౌల్ట్ 2, విఘ్నేశ్ పుతుర్ ఒక వికెట్ పడగొట్టారు. ఆర్సీబీకి తొలి ఓవర్‌లోనే షాక్ తగిలింది. ఫిల్ సాల్ట్‌ను ట్రెంట్ బౌల్ట్ క్లీన్‌బౌల్డ్ చేశాడు. తర్వాత క్రీజులోకి వచ్చిన దేవ్‌దత్ పడిక్కల్ దూకుడుగా ఆడాడు. బౌల్ట్ బౌలింగ్‌లో సిక్స్ కొట్టిన అతను.. దీపక్ చాహర్ వేసిన ఆరో ఓవర్‌లో 6,6,4 రాబట్టాడు. మరోవైపు, కోహ్లీ కూడా చెలరేగాడు. బుమ్రా బౌలింగ్‌లో విరాట్ ఓ సిక్స్ బాదాడు. విఘ్నేశ్ వేసిన 9వ ఓవర్‌లో కోహ్లీ సిక్స్ కొట్టి హాఫ్ సెంచరీ (29 బంతుల్లో) అందుకోగా.. అదే ఓవర్‌లో పడిక్కల్ ఔటయ్యాడు. దీంతో 91 పరుగుల భాగస్వామ్యానికి (52 బంతుల్లో) తెరపడింది. అనంతరం వచ్చిన పటీదార్ శాంట్నర్ బౌలింగ్‌లో రెండు భారీ సిక్స్‌లు కొట్టాడు. హార్దిక్ వేసిన 15 ఓవర్లో కోహ్లీ, లివింగ్‌స్టన్ (0) ఔటయ్యారు. మరోవైపు, పటీదార్ దూకుడు కొనసాగించాడు. హార్దిక్ వేసిన 17 ఓవర్‌లో వరుసగా 6, 6, 4 బాదేశాడు. ఈ ఓవర్‌లో మొత్తం 23 రన్స్ వచ్చాయి. మరో ఎండ్‌లో జితేశ్ శర్మ కూడా చెలరేగాడు. బౌల్ట్ వేసిన 19 ఓవర్‌లో రెండు సిక్స్‌లు బాదాడు.

## ఈసీబీ ఆ ఆఫర్ ఇస్తే తిరస్కరించండి..

### భారత క్రికెటర్లకు గావస్కర్ సూచన

భారత మాజీ కెప్టెన్ మన్సూర్ అలీఖాన్ పటౌడీకి గుర్తుగా ఇచ్చే పటౌడీ ట్రోఫీకి రిటైర్మెంట్ ఇవ్వాలని ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు యోచిస్తున్నట్లు ఇటీవల వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. ఇంగ్లాండ్ వేదికగా భారత్, ఇంగ్లాండ్ మధ్య జరిగే టెస్టు సిరీస్ విజేతకు ఈ ట్రోఫీని ఇస్తుంటారు. జూన్‌జులైలో జరిగే ఐదు టెస్టుల సిరీస్ నుంచే ఈసీబీ తన నిర్ణయాన్ని అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. పటౌడీ ట్రోఫీని రిటైర్ చేయడానికి కచ్చితమైన కారణం తెలియదు. అయితే, ఇకపై రెండు దేశాలకు చెందిన వేరే దిగ్గజాల పేరుతో ట్రోఫీ ఇచ్చే అవకాశముంది. ఈ అంశంపై భారత మాజీ కెప్టెన్ సునీల్ గావస్కర్ తాజాగా స్పందించాడు. పటౌడీ ట్రోఫీకి రిటైర్మెంట్ ఇవ్వాలని ఈసీబీ యోచిస్తుండటంపై అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఈ క్రమంలో భారత దిగ్గజ ఆటగాళ్లందరికీ ఓ విజ్ఞప్తి చేశాడు. 'పటౌడీ ట్రోఫీకి రిటైర్మెంట్ ఇవ్వాలని ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు యోచిస్తోందని ఇటీవల వచ్చిన వార్తలు కలవరపెడుతున్నాయి. ఏదైనా ట్రోఫీకి వ్యక్తుల పేర్లు పెట్టిన తర్వాత రిటైర్మెంట్ ఇవ్వడం గురించి మొదటిసారి వింటున్నా. ఈ నిర్ణయం పూర్తిగా ఈసీబీదే అయినప్పటికీ బీసీసీఐకి సమాచారం ఉండొచ్చు. ఇది భారత్, ఇంగ్లాండ్ క్రికెట్‌కు పటౌడీలు అందించిన సహకారం విషయంలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది.


## సమంత ఎక్స్‌లోకి రీఎంట్రీ..



సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే తారల్లో సమంత (Samantha) ఒకరు. 2012లో ఎక్స్‌లో (అప్పట్లో ట్విటర్) ప్రొఫైల్ ఓపెన్ చేశారు. అయితే, సమంత ఇందులో తన పోస్ట్‌లు అన్నిటినీ ఇటీవల డిలీట్ చేశారు. అప్పటి నుంచి ఇన్‌స్టా, ఫేస్‌బుక్, యూట్యూబ్‌లలో యాక్టివ్‌గా ఉంటున్నారు. తాజాగా సామ్ ఎక్స్‌లోనూ రీఎంట్రీ ఇచ్చారు. సోమవారం తొలి పోస్ట్‌ను పంచుకున్నారు. నటిగా తెరపై వైవిధ్యభరితమైన పాత్రలతో అలరించిన సమంత.. 2023లో నిర్మాతగా మారారు. 'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్' అనే ప్రొడక్షన్ హౌస్‌ను ప్రారంభించారు. ఇప్పుడీ నిర్మాణ సంస్థ తీసిన తొలి సినిమా 'శుభం' విడుదల కానుంది. ఈ విషయాన్ని తెలుపుతూ ఎక్స్‌లో సోమవారం పోస్ట్ పెట్టారు. 'పెద్ద కలలతో.. మా చిన్న ప్రేమను మీకు అందిస్తున్నాం. ఈ సినిమాని అందరూ ఆదరిస్తారని ఆశిస్తున్నా. ఇది నిజంగా నాకు ఎంతో ప్రత్యేకం. గొప్ప ప్రారంభం' అని రాసుకొచ్చారు. సామ్ రీఎంట్రీపై నెటిజన్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 'వెల్‌కమ్ బ్యాక్ సామ్', 'క్వీన్ ఈజ్ బ్యాక్' అంటూ కామెంట్స్ పెడుతున్నారు. ప్రస్తుతం ఈమెను ఎక్స్‌లో 10.2 మిలియన్ల మంది ఫాలో అవుతున్నారు.

# సినిమా

## వివాదాస్పద గీతం: 'అదిదా సర్‌ప్రైజ్' ఫుల్ వీడియో రిలీజ్



కొన్ని స్టెప్పుల విషయంలో 'అదిదా సర్‌ప్రైజ్' సాంగ్‌పై విమర్శలు వచ్చిన సంగతి తెలిసిందే. ఆ పాట ఫుల్ వీడియో తాజాగా విడుదలైంది. నితిన్, శ్రీలీల ప్రధాన పాత్రల్లో నటించిన 'రాబిన్‌హుడ్'లోని ప్రత్యేక గీతమిది. ఇందులో కేతికా శర్మ సందడి చేశారు. వ్యతిరేకత కారణంగా పలు మార్పులతో థియేటర్లలో ప్రదర్శించిన టీమ్.. అదే వెర్షన్‌ను ఇప్పుడు రిలీజ్ చేసింది.



## ఓటీటీలోకి కోర్ట్

ఇటీవల విడుదలై మంచి హిట్ అందుకున్న మూవీ 'కోర్ట్'. కేవలం రూ.10 కోట్ల బడ్జెట్‌తో రూపొందించగా, దాదాపు రూ.57 కోట్లు గ్రాస్ కలెక్షన్ సాధించింది. నేచురల్‌స్టార్‌నాని సమర్పించిన ఈ చిత్రాన్ని రామ్ జగదీశ్ తెరకెక్కించాడు. హర్ష్ రోషన్, శ్రీదేవి, ప్రియదర్శి, శివాజీ, సాయి కుమార్ కీలక పాత్రల్లో నటించారు. విమర్శకుల ప్రశంసలు అందుకున్న ఈ సినిమా ఓటీటీలోకి ఎప్పుడు వస్తుందా? అని ఆసక్తిగా ఎదురుచూస్తున్న మూవీ లవర్స్‌కి గుడ్ న్యూస్. తాజాగా దీని డిజిటల్ స్ట్రీమింగ్ డేట్ ని నెట్‌ఫ్లిక్స్ ఫిక్స్‌చేసింది. ఈనెల 11 నుంచి స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపింది. ఈ చిత్రానికి అన్ని వర్గాల నుంచి మంచి రెస్పాన్స్ రాగా..థియేటర్లలో తెలుగులో మాత్రమే రిలీజ్ చేశారు. కానీ ఇప్పుడు ఓటీటీలో మాత్రం ఏకంగా ఐదు భాషల్లో అందుబాటులోకి తీసుకురానున్నారు. తెలుగుతో పాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళం భాషలలో స్ట్రీమింగ్ కు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.



## 8 రోజుల్లో 161.50 కోట్లు




బాలీవుడ్ హీరో సల్మాన్ ఖాన్, నేషనల్ క్రష్ రష్మిక మందన్న హీరో హీరోయిన్లుగా తమిళ స్టార్ డైరెక్టర్ ఏఆర్ మురగదాస్ దర్శకత్వంలో వచ్చిన సినిమా సికందర్. ఈ సినిమాకు బాక్సాఫీస్ వద్ద వసూళ్ల వర్షం కురుస్తోంది. సల్మాన్ ఖాన్ ఫిల్మ్స్, సాజిద్ నడియావాలా గ్రాండ్ సన్స్ బ్యానర్ సంయుక్తంగా నిర్మించిన సికందర్‌ను ప్రముఖ నిర్మాత సాజిద్ నాడియావాలా నిర్మించారు. మరో స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ కీలకపాత్రలో అలరించింది. సుమారు 200 కోట్ల రూపాయల బడ్జెట్ తో ఈ సినిమా నిర్మించారు. మొత్తంగా 8 రోజుల వరకు సికందర్ చిత్రం భారత్‌లో నికరంగా రూ. 102.25 కోట్లు కలెక్ట్ చేసింది. రూ.116.15 కోట్ల గ్రాస్ అందుకుంది. భారత్‌లో వచ్చిన గ్రాస్ + ఓవర్సీస్ కలెక్షన్స్ రూ.45.35 కోట్లు కలిపి సికందర్ ప్రపంచవ్యాప్తంగా ఇప్పటి వరకు రూ.161.50 కోట్లు ఆర్జించినట్లు సాక్‌నిల్క్ వెబ్‌సైట్ నివేదించింది.



## ఓటీటీలోకి టైమ్‌లూప్ హారర్ మూవీ

**'రాక్షస' స్ట్రీమింగ్ ఎప్పుడంటే?**

ఓటీటీ వేదికగా ప్రేక్షకులకు థ్రిల్ పంచేందుకు 'రాక్షస' వచ్చేస్తోంది. 'సన్‌నెక్స్ట్'లో ఈ నెల 11 నుంచి స్ట్రీమింగ్ కానుంది. కన్నడ, తెలుగులో స్ట్రీమింగ్ అవుతుందని సదరు సంస్థ సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. కన్నడ నటుడు ప్రజ్వల్ దేవరాజ్ ప్రధాన పాత్రలో దర్శకుడు లోహిత్ హెచ్ తెరకెక్కించిన చిత్రమిది. టైమ్‌లూప్ కాన్సెప్టుతో సాగే హారర్ ఎలిమెంట్స్‌తో రూపొందిన ఈ సినిమా మార్చి తొలివారంలో థియేటర్లలో విడుదలైంది. ఓ కీలకమైన కేసు విషయంలో సరైన యాక్షన్ తీసుకోకపోవడంతో పోలీసు అధికారి శోభరాజ్‌ను డిస్మిస్ చేయాలని పైఅధికారి నిర్ణయిస్తారు. ఓ రోజు గడువు ఇస్తే క్రిమినల్స్ పట్టుకుంటానని శోభరాజ్ విజ్ఞప్తి చేస్తాడు.

Printed, Published by Mohammed Murthuza. Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 98660 19778, 89789 60131.